

సేవే దైవం.. రోగుల ఆకలి తీరుస్తున్న సత్యసాయి ట్రస్టు 6

అమ్మో.. హాస్టల్!

భవనాలు శిథిలం
సౌకర్యాలు లేవు
విద్యార్థులు ఉండలేరు
ముదినేపల్లి హాస్టల్ మూత



ముదినేపల్లిలో మూతపడిన ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహం

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్నవారు వెళ్లిపోయారు. కొత్తవారు చేరలేదు. ఫలితంగా ముదినేపల్లిలోని షెడ్యూల్డు కులాల కళాశాల స్థాయి బాలురు, బాలికల వసతిగృహాలు మూతపడ్డాయి. గత ఏడాది వరకు ఈ వసతిగృహాల్లో అరకొర సౌకర్యాలతో సరిపెట్టుకున్న విద్యార్థులు ఈ ఏడాది ఉండలేక వేరేచోటుకు వెళ్లిపోయారు. ముదినేపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గుడివాడలో ప్రైవేట్ రూముల్లో అద్దెకు ఉంటున్నారు. గతంలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 40 మంది విద్యార్థులున్న వసతి గృహంలో సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు స్వగ్రామాలకు దగ్గర్లోని ప్రభుత్వ వసతిగృహాల్లో చేరిపోయారు. ఐదేళ్ల క్రితం ఈ వసతిగృహం కళాశాల హాస్టల్‌గా మారింది. సుమారు 20 మంది విద్యార్థులు చేరారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో 2023-24లో ఐదుగురు విద్యార్థులు మిగిలారు. ప్రస్తుతం వారు కూడా వెళ్లిపోయారు.. కొత్తవారు చేరలేదు. మూతబడింది.

ముదినేపల్లిలోని ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహ భవనం పదేళ్లుగా శిథిలావస్థలో ఉన్నా పట్టించుకున్న వారు లేరు. గతంలో 80 మంది విద్యార్థినులు ఉండగా ప్రస్తుతం ఐదుగురు ఉన్నారు. వారు కూడా వసతిగృహంలో భోజనం చేసి రాత్రి ప్రైవేట్ భవనంలో ఉండాల్సిందే.

\- ముదినేపల్లి



ముదినేపల్లిలో శిథిలమైన ఎస్సీ కళాశాల బాలికల వసతిగృహం



బీచ్‌లో సందడి

కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు పేరుపాలెం బీచ్‌కు భారీగా తరలివచ్చారు. సుమారు 5వేల మంది బీచ్‌ను సందర్శించారని అంచనా.. 6లో



చిన వెంకన్న దర్శనం

శ్రీనివాసా.. గోవిందా అంటూ ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం మారు మోగింది. కార్తీకమాసంలో మొదటి ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో పోటెత్తింది.. 6లో



స్కూల్స్‌కు నిధులు ఫుల్

ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు కావల్సిన నిధులను విడుదల చేసింది పాఠశాలల నిర్వహణకు కావల్సిన వస్తు సామగ్రి, కరెంట్ బిల్లులు, రిజిష్టర్ల కొనుగోలు మొత్తం ఈ కాంపోజిట్ గ్రాంట్ నుంచి పొందడం ద్వారా ఉపాధ్యాయులకు ఊరట లభించినట్టయింది.. 7లో

పట్టభద్రులెక్కడ?

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదులో అధికార పక్షం బాగా వెనుకబడింది. నియోజకవర్గాల వారీగా రెండు వారాల క్రితమే కూటమి నేతలందరినీ సన్నద్ధం చేసినా సాధ్యమైనంత మేర ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఓటర్ల నమోదులో చురుగ్గా కదలాల్సిందిగా నేతలను ఆదేశించారు. కూటమి అభ్యర్థిని గెలిపించుకునే దిశగా శ్రేణులను సమాయత్తం చేసినా ఓటర్ల నమోదు ఆశించిన స్థాయిలో లేదు. ఓటర్ల నమోదు గడువు రెండు రోజుల్లో ముగియనున్నా 50 శాతం కూడా నమోదు కాలేదు.



- ఓటరు నమోదులో కూటమి నేతల తడబాటు
- ఉభయ గోదావరి జిల్లాల్లో గత ఎన్నికలకు 3 లక్షల మంది ఓటర్లు
- ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమలో 60 వేలు కూడా లేని ఓటర్ల సంఖ్య
- మరో రెండు రోజుల్లో ముగియనున్న గడువు
- నేతలు, కార్యకర్తలు కదలాలని అధినేత ఆదేశాలు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

టీడీపీ, బీజేపీ, జనసేన త్రయం ఉమ్మడిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. లక్ష్యం చేరడంలో ఓటర్ల నమోదు అత్యంత కీలకం. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో అనుకున్నంత మేర ఓటర్ల నమోదు పుంజుకోలేదు. సమన్వయ లోపం గ్రాడ్యుయేట్‌లను వెతికి ఆ మేరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో నమోదు చేసేందుకు కింది స్థాయి కేడర్ పెద్దగా ఉత్సాహం చూపలేదు. అయినప్పటికీ పట్టణాలు, నగరాల్లో మాత్రం కొంతలో కొంత ఓటరు నమోదు పూర్తి చేయగలిగారు. ఈనెల 6న ఓటర్ల నమోదుకు తుది గడువు. ఇప్పటిదాకా ఉన్న సమాచారం ప్రకారం గతంతో పోలిస్తే కొన్ని నియోజకవర్గాలు పూర్తిగా వెనుకబడే ఉన్నాయి.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూటమి ప్రభుత్వం తొలుత సీరియస్‌గా తీసుకుంది. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కూటమి అభ్యర్థిగా కాకినాడకు చెందిన పేరాబత్తుల రాజశేఖర్‌ను ఖరారు చేశారు. ఈ దిశగా ఎంత వీలైతే అంతమేర ఉమ్మడి పశ్చిమలో కూటమి ఎమ్మెల్యేలంతా సమష్టిగా నిర్ణయాలు, సమాంతరంగా ఓటర్ల నమోదు, ఆ తదుపరి కూటమి అభ్యర్థి గెలుపుకు అనుకూలంగా వ్యూహం ఖరారు చేసేందుకు సమాయత్తపరిచారు. కాని గ్రాడ్యుయేట్స్ ఎక్కువగా ఉన్న ఏలూరు కార్పొరేషన్‌తో సహా మునిసిపాలిటీలు భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, నిడదవోలు, కొవ్వూరు, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం వంటి ముఖ్యప్రాంతాలలో ఓటర్ల నమోదు అత్యధికంగా సాగాలని పక్షం రోజుల క్రితమే జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో ఏలూరులో ప్రత్యేక సమావేశం జరిగింది. సమావేశంలో ఓటర్ల నమోదే కాకుండా కూటమి అభ్యర్థి విజయానికి వ్యూహాలను ఎక్కడికక్కడ ఖరారు చేసుకుని ముందుకు సాగాల్సిందిగా ఆదేశించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు సునాయాసంగా ఉండేలా కూటమి నేతలంతా పక్కా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఆ మేరకు తక్షణం రంగంలోకి దిగి ఓటర్ల నమోదు భారీగా ఉండేలా చూడాలని సూచించారు.

చెప్పిందొకటి.. జరుగుతుందొకటి

రాష్ట్ర స్థాయి నేతలు నియోజకవర్గ నేతలకు ఇచ్చిన ఆదేశం ఒకటి, ఆచరణలో జరుగుతున్నది ఇంకొకటి. పరస్పర సమన్వయలోపం బహిర్గతమైంది. ఉభయగోదావరి పట్టభద్రుల నియోజకవర్గంలో గతంలో మూడు లక్షలకుపైబడి ఓటర్లు ఉన్నారు. ఇప్పుడు తాజాగా ఓటర్ల చేర్పింపులో మాత్రం అనుకున్నంత సజావుగా సాగలేదు. దీనికితోడు అనేక అడ్డంకులు. కూటమి నేతల మధ్య కొన్ని నియోజకవర్గాల్లో సమన్వయం లేకపోవడం కూడా ఓటర్ల నమోదులో వెనుకబాటుకు దారితీసింది.

45 శాతంలోపు నమోదు

ఇంతకుముందు నమోదైన ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ఇప్పటివరకు ఉభయగోదావరిలో కేవలం లక్షా 30 వేల మంది మాత్రమే ఓటర్లుగా నమోదయ్యారు. 40-45 శాతం మధ్యే ఓటర్ల నమోదు నత్తనడకన సాగినట్టయ్యింది. ఒక్క ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే సరాసరి 50 నుంచి 60 వేలలోపే ఓటర్ల సంఖ్య నమోదైనట్టు తెలుస్తుంది. ప్రత్యేకించి జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు సంఖ్య ఏమాత్రం ముందుకు సాగలేదు. మిగతా నియోజకవర్గాల్లో మునిసిపల్ కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో గ్రాడ్యుయేట్‌ల సంఖ్య అత్యధికం. మండల కేంద్రాల్లోను ఇంకాస్త పర్వాలేదనిపిస్తుంది. దీనిని కూర్పుచేసి ఓటర్ల నమోదుకు ముందుకు సాగాలి. ఆఖరుకు ఎక్కడికక్కడ దిగువ స్థాయి టీడీపీ నేతలు కూడా కలుగచేసుకుని ఓటర్ల నమోదుకు ప్రయత్నించారు. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్ల నమోదు ఎప్పటికప్పుడు ఒకేరకంగా ఉండదు. గతంలో ఉన్నదానికి, ఇప్పుడు నమోదవుతున్న ఓటర్ల సంఖ్యకు సారూప్యత లేకుండా పోయింది.

కదలండి.. కదిలించండి : సీఎం చంద్రబాబు

పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్ల నమోదుకు గడువు దగ్గరపడినందున నియోజకవర్గాల్లో వేగం పెంచాలని తక్షణం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు మిగతా కూటమి నేతలను సమన్వయపర్చుకుని ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు నాయుడు నేతలందరికీ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం పార్టీ ముఖ్యులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడిక్కడ లోటుపాట్లు ఉన్నది గుర్తించి ఆరా తీశారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో వెనుకపడకూడదని, రాబోయే రెండు రోజుల్లో వేగంగా స్పందించి ఓటర్ల సంఖ్య పెరిగేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. దీనికనుగుణంగానే కొన్ని నియోజకవర్గాల వరకే గ్రాడ్యుయేట్‌లను అన్వేషించి ఆ మేరకు ఓటరుగా నమోదు చేయాలని భావిస్తున్నారు. ఇంతకుముందైతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న టీచర్లను లక్ష్యంగా చేసుకుని పట్టభద్రుల ఓటర్ల నమోదు వేగంగా జరిగేది. ఉద్యోగులను ఎక్కడికక్కడ గుర్తించడం, వారిని ఓటర్లుగా నమోదు చేయడం వంటి చర్యల్లో పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో వేగంగా కదిలేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అయినా రాబోయే రెండు రోజుల్లో ఈ వర్గాల వైపు పూర్తిగా దృష్టి పెట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది.

ఉమ్మడి పశ్చిమగోదావరి ఏపీఎన్జీవో సంఘ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ తాజాగా ఎక్కడికక్కడ పట్టభద్రులైన ఉద్యోగులను కూడా ఓటర్లుగా నమోదు చేయించారు. అంత చొరవ కూడా కొన్ని నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ప్రాధాన్యం ఇవ్వలేకపోయినట్టు కనిపిస్తుంది.

వలసపోయిన ఓటర్లు

ఉభయగోదావరి జిల్లాల్లో అత్యధిక గ్రాడ్యుయేట్‌లు ఉపాధి అవకాశాల కోసం హైదరాబాద్, ఇతర నగరాలకు తరలిపోయారు. ఉన్నప్రాంతం నుంచి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడడం వంటి పరిణామాల నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్ల నమోదులో అడ్డంకి ఏర్పడినట్టు కూటమి నేతలు చెబుతున్నారు. కూటమి పక్షంలో తెలుగుదేశంకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మాత్రం తమ పరిధిలో ఎక్కడికక్కడ పట్టభద్రులను గుర్తించి మరీ ఇంటింటికి వెళ్లి నమోదు చేశారు. అయినప్పటికీ ఒక్కో నియోజకవర్గంలోను మూడు, నాలుగు వేలకు మించి సంఖ్య పెరగలేదు. ఏలూరు నియోజకవర్గంలో దాదాపు మూడు వేలకుపైగా ఓటర్లు నమోదయ్యారు. ఈ క్రమంలో ఈనెల 6తో ఓటర్ల నమోదు ప్రక్రియ ముగియనుంది. వచ్చే రెండు రోజుల్లో అన్ని నియోజకవర్గాల్లోను మహా అయితే ఒకటి రెండు శాతం మాత్రమే ఓటర్ల నమోదు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికల కంటే ఓటర్ల సంఖ్య తక్కువ కావచ్చు.

టీచర్లకు బోధనేతర పనులు వద్దు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు



యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ఏలూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కలిగించడానికి ప్రభుత్వాలు ఎంత మాత్రం పట్టించుకోవడం లేదని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. యూటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంఘ స్వర్ణోత్సవ మహాసభలు ఆదివారం ఏలూరులో ప్రారంభమయ్యాయి. అన్ని మండలాల నుంచి ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి సోషల్ స్టడీస్ పాఠ్యాంశాలు ఉపాధ్యాయులకే అర్థంకానంతగా జఠిలంగా ఉన్నాయని, భారీ సిలబస్‌ను తగ్గించాలని పలుమార్లు విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదని విమర్శించారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి బోధన అంటూ వివిధరకాల కరికులం ప్రవేశ పెడుతూ ఏటా పదుల సంఖ్యలో టీచర్లకు శిక్షణ ఇవ్వడం, తదుపరి ఏడాది అవి పనికిరావంటూ కొత్తగా శిక్షణ ఇవ్వడం మన రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితి అని ఆరోపించారు. త్వరలో జరుగనున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తిని గెలిపించడానికి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూడా పీడీఎఫ్ తరపున అభ్యర్థిని ఖరారుచేయనున్నామని, ఆ స్థానాన్నికూడా కైవసం చేసుకునేందుకు శ్రమించాలని సూచించారు.

జీవో 117 రద్దు ఫలితం ఎక్కడ?

ప్రభుత్వ పాఠశాలల మనుగడను ధ్వంసం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117 ఉత్తర్వులతో వేలాది పాఠశాలలు మూతపడగా, లక్షలసంఖ్యలో బాలబాలికలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.రవికుమార్ ఆరోపించారు. ఈ జీవో రద్దుచేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం ప్రకటించి నెలలు గడుస్తున్నా ప్రాథమిక తరగతులను తిరిగి మాతృ పాఠశాలలకు ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. జీవో 117 ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు రెండింటినీ సమాంతరంగా ప్రారంభించి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ సీహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ టీచర్లు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో సోమవారం జిల్లా నూతన కమిటీ ఎన్నుకుంటారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపిమూర్తి, రాష్ట్ర, జిల్లా నాయకులు సుభాషిణి, షేక్‌ముస్తఫా అలీ, కుసుమకుమారి, శ్యాంబాబు, కనకదుర్గ, రాంబాబు, రంగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ



మన్యంలో కొలువైన గుబ్బల మంగమ్మను ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య వారం వారం పెరుగుతూనే ఉంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీవారు తెలిపారు. - బుట్టాయగూడెం

పత్తికి.. గడ్డుకాలం



వర్షాలకు వరిగిన మొక్కలు, నేలరాలిన పత్తి

- వర్షాలకు తడుస్తున్న పంట
- బూజు పట్టి నల్లబడే అవకాశం
- ప్రస్తుతం క్వింటా ధర రూ.5500 - రూ.6000
- గిట్టుబాటు కాదంటున్న రైతులు



కుక్కునూరు మండలంలో విస్తారంగా సాగవుతున్న పత్తిపంట

కుక్కునూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెల్లబంగారంగా పిలువబడే పత్తిసాగుకు ప్రస్తుతం కష్టకాలం ఎదురైంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో సుమారు 18 వేల ఎకరాల్లో పత్తిసాగు చేపట్టారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఏటా గోదావరి వరద ముంచెత్తి నష్టపోతుండడంతో గోదావరి ముంపు బారిన పడని మెట్ట ప్రాంతాలు, పోడు భూముల్లో అత్యధికంగా పత్తిసాగు చేపట్టారు. వారం రోజుల క్రితం వరకు పత్తి సాగు ఆశాజనకంగా ఉంది. రైతులు పత్తి తీయడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఇంతలోనే వర్షాలతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పత్తికాయ నుంచి పగిలిన పత్తికి వర్షం కారణంగా బూజుపట్టి నల్లబడే అవకాశం ఉంది. మొక్కపై ఉన్న పూత రాలిపోవడంతో పాటు కాయలతో ఉన్న మొక్కలు వర్షం కారణంగా పక్కకు ఒరిగిపోతున్నాయి. ఈ ఏడాది పత్తిసాగుపై ఎన్నో ఆశలతో ఉన్న రైతాంగానికి ఏం చేయాలో తోచడం లేదు.

గతేడాది వర్షాలు లేక నష్టం

గతేడాది సెప్టెంబరు నుంచి వర్షాలు లేక పత్తి పంటకు తడులు అందక దిగుబడులు తగ్గి రైతులు నష్టపోయారు. తడులు అందించడానికి వేలాది రూపాయలతో డీజిల్ ఇంజన్లు, పైపులు కొనుగోలు చేశారు. సమయానుకూలంగా తడులు అందక ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అధిక శాతం రైతుల పంటలకు తడులు అందక ఎండిపోయాయి. పండిన పంటకు క్వింటా ధర రూ.6వేలు నుంచి రూ.7వేల లోపే పలికింది. పంట దిగుబడి తగ్గడం, ధర లేక రైతులు నష్టపోయారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా కురవడంతో పత్తి ఆశాజనకంగా మారింది. మొదటి కాపులోనే నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అనూహ్య వర్షాలతో నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. గతేడాది అనావృష్టితో ఈ ఏడాది అతివృష్టితో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ సీజన్ ఆరంభంలో క్వింటా పత్తి రూ.9 వేలు పైగా ధర పలికింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.5500 - రూ.6000 పలుకుతోంది. దీంతో ధర గిట్టుబాటు కాదని రైతులు వ్యక్తం చేస్తున్నారు. క్వింటా ధర రూ.9వేలు పైగా పలికితేనే ఒడ్డున పడతామని రైతులు చెబుతున్నారు.



ఏక బిల్వం శివార్పణం



అరుణాచలం నుంచి తెచ్చిన మహాబిల్వం మొక్క..

ద్వారకాతిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పరమశివునికి అత్యంత ప్రీతి పాత్రమైన కార్తీక మాసం వచ్చేసింది. ఈనెల రోజులూ రుద్రాభిషేకాలు, బిల్వా ర్చనలు చేస్తూ భక్తులు ఆ భోళాశంక రుని అనుగ్రహం కోసం పరితపిస్తారు. బిల్వాష్టకం... బిల్వ పత్రాల ప్రాముఖ్యతను తెలియచేస్తుంది. ఈ బిల్వపత్రం (మారేడు దళం) పరమశివునికి ప్రీతికరం..బిల్వ దళాన్ని త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ప్రతిరూపంగా భావిస్తారు. పురాణాల ప్రకారం బిల్వపత్రం లోని మూడు ఆకులు శివుని మూడు నేత్రాలను సూచిస్తాయి.

త్రిదళం త్రిగుణాకారం....త్రినేత్రంచ త్రియాయుధం...త్రిజన్మ పాపసంహారం.. ఏకబిల్వం శివార్పణం..

అంటూ ఆ మహాదేవుని పూజిస్తారు. ఈ త్రిదళ బిల్వ పత్రంలో కుడివైపు విష్ణువు, ఎడమవైపు బ్రహ్మ, మధ్యలో శివుడు కొలువై ఉంటాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ త్రిబిల్వం మహాదేవుని త్రినేత్రాలను, లేదా ఆయన ఆయుధం త్రిశూలాన్ని సూచిస్తాయని కూడా అంటారు. ఈ బిల్వపత్రాలు చాలా రకాలున్నాయి. ఏకబిల్వం, త్రిబిల్వం, సప్తబిల్వం, షణ్ముఖ బిల్వం. పంచముఖ బిల్వం, అఖండ బిల్వం. బిల్వ వృక్షానికి వేదకాలం నుంచి ప్రత్యేక గుర్తింపు ఉంది. బిల్వపత్రం శివునికి, నారాయణునికి, అమ్మ వారికి ఎంతో ప్రీతికరమైనది. బిల్వపత్రాన్ని తెలుగులో మారేడుగా పిలుస్తారు. మారేడు ఆకులు మూడు కలిపి శివునికి మూడు కళ్లుగా ఉంటాయి. శివుడు ఈ మారేడు చెట్టుకింద నివాసం ఉంటాడని పండితులు చెబుతున్నారు. మారేడు దళాలు లేకుండా శివార్చన లేదు.. బిల్వ వృక్షాల విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ద్వారకాతిరుమల శ్రీవారి శేషాచలకొండపై వీటిని ఎంతో శ్రద్ధగా పెంచుతున్నారు. ముఖ్యంగా క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయ ఆవరణలో ఏకబిల్వం, మహాబిల్వం మొక్కలను నాటి పోషిస్తున్నారు. అరుదుగా లభించే మహాబిల్వం మొక్కను ప్రత్యేకంగా అరుణాచల ప్రదేశ్ నుంచి తెచ్చి నాటారు. క్షేత్రంలో ఈ బిల్వ వృక్షాలకు కొదవలేదు. ఈ చెట్టుకు ఒళ్లంతా దేవతలే అని చెబుతారు. మృత్యువంచనం, శాండిల్యం, శివద్రుమం, ఇలా దీనికి అనేక పేర్లున్నాయి. శనిదోషమున్నవారు బిల్వపత్రాలతో శివయ్యను పూజించవచ్చని పండితులు చెబుతున్నారు. లక్ష్మీదేవి తపస్సు ఫలితంగా బిల్వవృక్షం పుట్టిందని అందుకే ఆమెను బిల్వ నిలయా అని పిలుస్తారు. శ్రీ అంటే బిల్వమని, మారేడు చెట్లు విస్తారంగా ఉండటం వల్లే శ్రీశైలం అనే పేరు వచ్చినట్లు చెబుతున్నారు.

ఎప్పుడు కోయకూడదు

మారేడు దళాన్ని ఎప్పుడు బడితే అప్పుడు కోయకూడదని పండితులు చెబుతున్నారు. ముఖ్యంగా సోమ, మంగళవారాల్లో, ఆరుద్ర నక్షత్రం, సంధ్యా సమయం, రాత్రివేళల్లో, శివరాత్రి, సంక్రాంతి, అలాగే పండుగల సమయాల్లో కోయకూడదంటున్నారు. వాటిని ముందు రోజుకోసి భద్రపరిచి పరమశివుని పూజిస్తారు.

మెండుగా ఔషధ గుణాలు

మారేడు ఆకులు, పండ్లలో చాలా ఔషధ గుణాలున్నాయి. దీని ఆకుల రసం అతిసార వ్యాధి , మొలలు, చక్కెర వ్యాధి నివారణకు వినియోగిస్తారు. మారేడు పండ్లు, కాయలు, బెరడు, వేళ్లు, ఆకులు, పువ్వులు, అన్నీ ఔషధాలుగా ఉపయోగపడుతాయి. ఆకుల కషాయం జ్వరాన్ని, ఎసిడిటీని, మలేరియాను తగ్గిస్తుంది. బిల్వ ఫలరసానికి కొంచెం అల్లం రసం కలిపి తాగితే రక్త సంబంధ ఇబ్బందులు తొలుగుతాయి. బిల్వ వేరు, బెరడు, ఆకులను ముద్దగా నూరి గాయాల మీద అద్దితే అవి త్వరగా మానుతాయి. క్రిమి, కీటక విషానికి విరుగుడుగా పనిచేస్తుంది. బిల్వాది గుటిక, బిల్వాది లేహ్యం, బిల్వాది పానకం వంటి ఆయుర్వేద ఔషధాల తయారీలో ఈ మారేడును విని యోగిస్తారని వైద్యులు చెబుతున్నారు.



ద్వారకాతిరుమల చిన వెంకన్నకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసా.. గోవిందా శ్రీవెంకటేశా గోవిందా అంటూ గోవింద నామస్మరణలతో ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం మారుమోగింది. కార్తీకమాసంలో మొదటి ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో పోటెత్తింది. దాదాపు 20 వేల మంది పైబడి యాత్రికులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. సెలవుదినం కార్తీక పర్వదినాలు కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు క్షేత్రానికి చేరుకుని క్యూలైన్లలో శ్రీవారి దర్శనం కోసం వేచి చూశారు. చెట్లవద్ద పలువురు మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం వకుళమాత అన్నప్రసాద భవనంలో ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది.



గరికపాటిని సత్కరించిన ఉద్దరాజు ఫౌండేషన్ సభ్యులు

కోర్కెలు అదుపులో ఉంటే ఆరోగ్యం..ఆనందం

భీమవరం టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) :కోరికలు అదుపులో పెట్టుకున్న వారే ప్రశాంతంగా ఆరోగ్యంగా ఉంటారని, కామ క్రోధ మోదములను ఎవరైతే జయిస్తారో వారు సుఖ శాంతులు అనుభవిస్తారని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. భీమవరం ఆనంద ఫంక్షన్ హాలులో ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేకూరి వేంకట సూర్య నారాయణరాజు (విశ్రాంత న్యాయమూర్తి, దేవుడు రాజు) జయంతి ఉత్సావాల్లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన ఆధ్యాత్మిక ప్రసంగంలో ఆయన మాట్లాడారు. సంబరాసురుడుకీ మన్మధుడుకు మధ్య జరిగే యుద్ధమే సంబరాసుర యుద్ధం అంటారని, సంభారాసురుడు బలవంతంగా కోరికలు, వాంఛలు, తీర్చుకుంటే, మన్మధుడు న్యాయబద్ధంగా తనని ఇష్టపడిన వారికే కోరిక తీర్చేవాడన్నారు. సంభారాసురుడు తన కోరికల వల్లే చనిపోయాడు అని అందుకే పరస్త్రీ వ్యామొహం మంచిది కాదని శ్రీరాముడుకు వశిష్ఠ మహర్షి తెలిపారన్నారు.

అనంతరం గరికపాటిని ఫౌండేషన్ ఛైర్మన్ విశ్వనాథరాజు కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు కంతేటి వెంకటరాజు, డీఎస్ చంద్రాజీ, పైడిరాజు, ఉద్దరాజు జోగిరాజు, ఆనందరాజు, రాంబాబు, ఛాంబర్ మాజీ ఛైర్మన్ సత్యనారాయణరాజు, త్యాగరాజ గానసభ సెక్రటరీ కారుమూరి బాబు, ఆనంద శ్రీనివాస్ తదితరులు సత్కరించారు.

గజకర్ణితో శ్వాస సమస్యలకు ఉపశమనం



ఆకివీడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముక్కులోని గాలి ముక్తికి దారని యోగాసనాచార్య కందుల సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆకివీడు పతంజలి యోగారోగ్య కేంద్రంలో యోగా శిష్య బృందానికి ముక్కులో తాడు వేసి జలనేత్రి, సూత్రనేత్రి, గజకర్ణి ప్రక్రియలు చేశారు. ముక్కులో నీళ్ళు, తాడు వేయడంతో పాటు గజకర్ణి చేయడం వల్ల ముక్కులోని శ్లేష్మంతో పాటు బ్యాక్టీరియా తొలగతుందన్నారు. శ్వాస సంబంధిత సమస్యలకు ఉపశమనం కల్గిస్తుంది నాడీ వ్యవస్థ, మనస్సు ప్రశాంతం చేస్తుంది. ఒత్తిడి నుంచి ఉపశమనంతో పాటు మనసుకు స్వాంతన కల్గిస్తుంది. కళ్ళు, ముక్కు ప్రాంతాల పనితీరు మెరుగుపరుస్తుంది. గురక సమస్యకు పరిష్కారం లభిస్తుంది. జీర్ణక్రియను పెంచడమే కాకుండా మూత్రపిండాల పనితీరు కూడా బాగుంటుందని చెప్పారు.

ఆకలితో ఉన్నవారికి అన్నమే అమృతం.. వారి ఆకలి తీర్చేవాడే దేవుడు.. అన్నం పరబ్రహ్మ స్వరూపం..అంటారు.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తూ డాక్టర్లు సేవలందిస్తుంటే రోగులకు అన్నదానం చేస్తూ వారి ఆకలి తీరుస్తున్నారు సత్యసాయి ట్రస్టు సభ్యులు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీరు క్రమం తప్పకుండా సేవలందిస్తున్నారు.

సేవే దైవం..

రోగుల ఆకలి తీరుస్తున్న సత్యసాయి ట్రస్టు

తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజనాలు





భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో..

భీమవరం క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, ఏలూరు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు, వారికి తోడుగా వచ్చిన బంధువులకు సత్యసాయి ట్రస్టు ఆకలి తీరుస్తోంది. భీమవరంలో 8 సంవత్సరాలుగా ప్రభుత్వాసుపత్రి పైఅంతస్తులో ట్రస్టు భోజనశాల ఏర్పాటు చేసి ఆహారాన్ని అంది స్తున్నది. రోజుకు 50 నుంచి 70 మంది వరకు ఆహారాన్ని స్వీకరిస్తారని ట్రస్టు సభ్యులు చెబుతున్నారు. పది మంది సభ్యులు సేవ చేస్తున్నట్టు తెలిపారు. అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు.

తణుకు : తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని సత్యసాయి ట్రస్టు నిత్యం అన్నప్రసాదం అందిస్తున్నారు. ఎంతో దూరం నుంచి ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటున్న రోగి బంధువులకు ఆకలిని తీరుస్తుంది. 2017లో అన్న ప్రసాదం అందించేందుకు వసతి కావాలని అప్పటి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టిలో పెట్టగా, అప్పటి కలెక్టర్ కాటంనేని భాస్కర్ భవనం కేటాయించారు. ఆరోజు నుంచి ఇప్పటికి ఎనిమిది సంవత్సరాల నుంచి నిరంతరాయంగా అన్న ప్రసాదం అందిస్తు న్నారు. ప్రతి రోజు రోగి బంధువులకు వంద మందికి భోజనాలు పెడతారు. ఇక సాయి భక్తులు తణుకు చుట్టు పక్కలు 30 గ్రామాల్లో ఉన్నారు. రోజుకు ఒక గ్రామం చొప్పున భక్తులు ఏ గ్రామం నుంచి రావాలో ముందుగానే సమాచారం ఇస్తారు. ఆవిధంగానే ప్రతిరోజు నాలుగు నుంచి ఆరుగురు భక్తులు వచ్చి సేవలందిస్తుంటారు.

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలోనే ఐదేళ్లుగా ట్రస్ట్ సేవలు అందిస్తోంది. ఉదయం సాయంత్రం రెండుపూటలా వంద మందికి పైగా అన్నదానం నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ సహకారంతో కొంత, దాతల సహకారంతో మరికొంత రోగులకు, రోగుల చెంతకు వచ్చే బంధువులకు అన్నదానం చేస్తున్నారు. కరోనా విపత్కర సమయంలోనూ సభ్యులు భయపడ కుండా అన్నదానం కొనసాగించారు. ఇళ్ల వద్ద ఉంటూ వైద్యం పొందుతున్న రోగులకు ఇళ్లకే పార్శిళ్లను అందించేవారు.



తాడేపల్లిగూడెంలో..

నాణ్యమైన ఆహారం పెడుతున్నారు



సత్యసాయి సేవాట్రస్టు వారు ఎంతో నాణ్యమైన, రుచికరమైన ఆహారం పెడుతున్నారు. నాలుగు రోజులుగా ఆహారాన్ని తింటున్నాను. ఆహారం కోసం వచ్చిన వారిని ఎంతో ఆప్యా యంగా పలకరించడం చాలా గొప్ప విషయం. ఏమీ ఆశించకుండా సేవ చెయ్యడం భగవత్ సంకల్పం.

గ్రేసమ్మ,రోగి, పెద అమిరం

చాలా ఉపయోగం



అన్నప్రసాదం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగి బంధువులకు చాలా ఉపయోగకరంగా ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి హోటల్‌లో భోజనం చేయాలంటే చాలా ఖర్చు అవుతుంది. ఇక్కడ సత్యసాయి ట్రస్టు అన్న ప్రసాదం అందించడం చాలా ఆనందంగా ఉంది.

- అంజలీదేవి, రోగి బంధువు, వేల్పూరు

సేవ చెయ్యడంలో ఆనందం..



ఎనిమిదేళ్లుగా భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో సత్యసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ సెక్రటరీ చలపతి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నాం.రోగులకు అన్నదానం చేయడం చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. వారంతా చాలా ప్రయాసలు పడి చాలా దూరం నుంచి వస్తుంటారు. వారికి ఇంత అన్నం పెడితే వారి కళ్లలో చెప్పలేనంత ఆనందం కనిపిస్తుంటుంది.

-రమణమూర్తి, ట్రస్టు ట్రెజరర్, భీమవరం

రోగుల సంఖ్య బట్టి వండుతాం



సాయి సేవలో ఉన్న సంతృప్తి ఎక్కడా ఉండదు. ఇక్కడ అన్న ప్రసాదం ప్రారంభించి నప్పటి నుంచి నిర్వాహణ బాధ్యతలు అందరి సహకారంతో చేస్తున్నా. ప్రతిరోజు అన్ని వార్డులోని రోగి మంచం వద్దకు ఆ సేవకులు వెళ్ళి అన్న ప్రసాదం కూపన్లు ఇస్తారు. దానిని బట్టి ఇక్కడ వంటకాలు తయారు చేస్తాం. మధ్యలో ఎవరైనా వచ్చినా వారి ఆకలి తీర్చడానికి ప్రయత్నం చేస్తాం.

- పాతపాటి సత్యనారాయణ రాజు, నిర్వాహకుడు, తణుకు

అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ..



రోగులకు అన్ని ఏరియా ఆసుపత్రుల్లో సత్యసాయి ట్రస్ట్ భోజనాలు అందిస్తున్నది. తాడేపల్లిగూడెంలో ఐదేళ్ల నుంచి సేవలందిస్తున్నాం. ట్రస్ట్ సభ్యులంతా కలిసి భోజనాలు పెడుతుంటాం. దాతలు పుట్టిన రోజు, పెళ్లిరోజులాంటి వేడుకల సందర్భంగా భోజనాలు వారే దగ్గరుండి వడ్డిస్తుంటారు.

-ప్రవా శ్రీనివాస్, సత్యసాయి ట్రస్ట్ కన్వీనర్,తాడేపల్లిగూడెం

మానవ సేవే మాధవ సేవ

కానుమిల్లి శశిశేఖరరావు, జిల్లా అధ్యక్షుడు, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఏలూరు జిల్లా



పేద ప్రజలకు సేవలు చేయాలని, మానవ సేవయే మాధవసేవ అనే సంకల్పంతో జిల్లాలో ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు శ్రీసత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నపూర్ణ సేవా ఫౌండేషన్ ద్వారా ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించాం. జిల్లాలో మొట్ట మొదటిసారిగా 2015 ఫిబ్రవరి 1వ తేదీన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో అప్పటి కలెక్టర్ కాటమనేని భాస్కర్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించాం. ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మధ్యాహ్నం 200 మందికి, రాత్రి 100 మందికి ఉచిత భోజన వసతిని అందిస్తున్నాం. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయానికి ప్రతి సోమవారం వచ్చే ఫిర్యాదుదారులకు గతంలో ఎస్పీగా పనిచేసిన ఐపీఎస్ అధికారి మేరీ ప్రశాంతి సూచన మేరకు అక్కడ కూడా ప్రతి సోమవారం 80 మంది వరకూ భోజ నాలు అందిస్తున్నాం. జిల్లాలో కైకలూరు ప్రభుత్వా సుపత్రిలో రోజుకు 120 మందికి, జంగా రెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 80 మందికి, ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులకు రోజుకు 200 మందికి ఉచిత భోజనం అందిస్తున్నాం. ప్రతి శుక్రవారం గర్భిణులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం అందిస్తున్నాం. నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో ఉచిత భోజన సదు పాయాన్ని ఏర్పాటు చేయడానికి అక్కడ తమకు ఒక డైనింగ్ హాలు, వంట శాలను ఆసుపత్రి అధికారులు కల్పించాలని కలెక్టర్ గతంలో ఆదేశించారు. వారు అవి కల్పిం చిన వెంటనే అక్కడకు ఎంత మంది రోగులు వస్తే అంత మందికి మధ్యాహ్నం, రాత్రి భోజన వసతిని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఆసుపత్రికి ఎన్నో బాధలతో వచ్చే వారందరూ ఆకలితో అలమటించకుండా ఉండడానికి వారి ఆకలి తీర్చడానికి ఆసుపత్రులను ఎంచుకున్నాం.

-ఏలూరు క్రైం



నరసాపురం రైల్వేస్టేషన్‌లో బారులు తీరిన ప్రయాణికులు...లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీ వద్ద రద్దీ

తిరుగు ప్రయాణంలో అవస్థలు

రైలు, బస్ స్టేషన్లలో రద్దీ

నరసాపురం, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు సొంతూరుకు వచ్చిన ప్రయాణికులు ఆదివారం తిరుగుముఖం పట్టారు. జిల్లా నుంచి హైదరాబాద్, విశాఖవైపు వెళ్లే రైళ్లన్నీ రద్దీగా కనిపించాయి. బెంగుళూరు వెళ్ళే శేషాద్రి, చెన్నై వెళ్ళే సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లలోనూ ఇదే పరిస్థితి. ఈసారి దీపావళి గురువారం వచ్చింది. దీంతో చాలామంది శుక్రవారం సెలవు పెట్టుకుంటే శని, ఆదివారాలు కలిసి వస్తాయని స్వస్థలాలకు వచ్చారు. వీరంతా ఆదివారం తిరుగుముఖం పట్టారు. ఈ కారణంగా దూరప్రాంత రైళ్లలో రద్దీ కనిపించింది. నరసాపురం నుంచి రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్ కాకుండా హైదరాబాద్‌కు ఒక ప్రత్యేక రైలు నడిపారు. ఇదికూడా నిండుకుంది. టిక్కెట్లు దొరకని ప్రయాణికులంతా జనరల్ బోగీని ఆశ్రయించారు. దీంతో రైలు బయలుదేరే నరసాపురంలోనే రైలు నిండుకోవడంతో పాలకొల్లు, భీమవరం స్టేషన్‌లలో జనరల్ బోగీ కోసం ఎదురుచూసిన ప్రయాణికులకు నిరాశే మిగిలింది. ముందుగా డిమాండ్ ఉన్నప్పటికీ రైల్వే మాత్రం దానికి అనుగుణంగా స్పెషల్ రైళ్ళు నడపకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఆర్టీసీ మాత్రం రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనపు సర్వీసులు నడిపింది.

హైదరాబాద్‌కు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

భీమవరం టౌన్ : హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్ళేందుకు వీలుగా భీమవరం నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి హైదరాబాద్‌కు ప్రతినిత్యం తిరిగే 13 సర్వీసులకు అదనంగా 7 సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎన్వీ ఆర్ వరప్రసాద్ తెలిపారు. ఎటువంటి అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా పంచా రామ క్షేత్ర దర్శనం, ఏకాదశ రుద్రుల యాత్ర, మన్యసీమ దర్శిని, శబరిమల వంటి టూర్ ప్యాకేజీలను అందుబాటులోకి తీసు కువచ్చినట్లు తెలిపారు.



పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు పేరుపాలెం బీచ్‌కు, భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ ఉన్నా తర్వాత మబ్బులుగా ఉండి వాతావరణం చల్లబడింది. సుమారు 5 వేల మంది పర్యాటకులు బీచ్‌ను సందర్శించారని అధికారులు అంచనా వేస్తున్నారు.ఆర్డీవో దాసి రాజు బీచ్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. డీఎస్పీ ఎంబీఎన్ మురళీ కృష్ణ పర్యవేక్షణలో సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్ఐలు, 90 మంది సిబ్బందితో బందోబస్త్ ఏర్పాట్లు చేశారు. సముద్ర స్నానం చేసేవారు ఎక్కువ దూరం సముద్రంలోకి వెళ్ళకుండా సుమారు 150 మీటర్ల దూరంలో బారికేడ్‌లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. సందర్శకులు సముద్ర అలల మధ్య సేద తీరారు .

భీమవరంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు

భీమవరం అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 13, ఓపెన్ అండ్ గర్ల్స్ చెస్ చాంపియన్ షిప్ 2024 పోటీలను ఆదివారం భీమవరం ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో డీఎస్పీ జయసూర్య ప్రారంభించారు. అక్టోబరు నెలలో ప్రపంచ సమాఖ్య నిర్వహించిన పోటీల్లో అత్యధిక రేటింగ్ సాధించిన క్రీడాకారులకు జ్ఞాపికలు అందించారు. ఈ టోర్నమెంటులో గెలుపొందిన క్రీడాకారులు నవంబరు 19 నుంచి 21 వరకు తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. అరసవల్లి మణికంఠ, చదరంగ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, కార్యదర్శి గమిని రవికుమార్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ జయసూర్య



బహుమతులు అందజేస్తున్న చెస్ కమిటీ ప్రతినిధులు

ఉత్సాహంగా ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్

ఏలూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రామచంద్రారావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో ఆదివారం ఏలూరు జిల్లా చెస్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఫస్ట్ చెస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఛైర్మన్ శర్మ, వైస్ ఛైర్మన్ వర్మ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.జ్యోతిసుధాకర్ కృష్ణ తదితరులు పాల్గొని ప్రారంభించారు. సాయంత్రం విజేతలకు బహుమతులు అందించారు. జనసేన పార్టీ ఏలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ రెడ్డిఅప్పల నాయుడు పాల్గొని బహుమతులు అందజేశారు. అండర్ -6 నుంచి అండర్ -16 వరకు 12 విభా గాల్లో మొదటి పదిస్థానాలు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. 120 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కన్వీనర్ వేల్పూరి వాసు దేవరావు తెలిపారు. లక్కోజు అనీల్ ఆచార్య, బాడిత నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోటీల్లో విజేతలకు బహుమతులు

ద్వారకాతిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గతనెలలో జరిగిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా జరిగిన రాష్ట్ర, జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గెలుపొంది విజయం సాధించిన మండల ఉపాధ్యాయులు జ్ఞాపికలను అందుకున్నారు. ఏలూరు డీసీఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సభలో ఈ అవా ర్డులను అందుకున్నారు. ఉపాధ్యాయలు పైడి రాజేశ్వరి, మద్దాల పెద్దిరాజు, నంబూరి రాంబాబులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో గెలుపొందారు. గత నెలలో గుంటూరులో రాష్ట్ర స్థాయిలో జరిగిన 45 ప్లస్ మహిళల నడక పోటీల్లో ద్వారకాతిరుమల మండంల పంగిడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని పైడి రాజేశ్వరి ప్రథమస్థానం పొందారు. జిల్లా స్థాయిలో 45 ప్లస్ విభాగంలో దొరసానిపాడు టీచర్ నంబూరి రాంబాబు ద్వితీయస్థానం పొందారు. క్యారమ్స్‌లో పంగిడిగూడెం స్కూల్ పిఈటీ మద్దాల పెద్దిరాజు విజేతగా నిలవడంతో వీరికి మహా సభలో మెమెంటోలను,సర్టిఫికెట్లు ఇచ్చి సత్కరించారు.





విరిసిన బ్రహ్మకమలం

ద్వారకాతిరుమల, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): గుండుగొలనుకుంట గ్రామంలోని కండిగలమ్మ ఆలయం వద్ద బ్రహ్మకులం విరిసింది. ఏడాదికోసారి మాత్రమే ఇది పూయడంతో దీని వికాసాన్ని గ్రామస్థులు కనులారా వీక్షించారు. దీనిని కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్ అంటారు. ఇది ఎక్కువగా హిమాలయపర్వతాలు, ఉత్తరప్రదేశ్, ఉత్తరబర్మా, టిబెట్, నేపాల్, తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ మొక్కపై ఆకులే పువ్వుగా రూపాంతరం చెందుతాయి.

స్కూళ్లకు నిధులు ఫుల్

ప్రభుత్వ పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్ల విడుదల





» ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రాధాన్యం » సుద్దముక్కకు సొమ్ముల్లేని స్థితి నుంచి అన్ని వసతులకు అవకాశం

నిడమర్రు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయమని, విద్యకు అధిక ప్రాధాన్యమిస్తామంటూ సూచించిన కూటమి ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు కావల్సిన నిధులను విడుదల చేసి చిత్తశుద్ధిని చాటింది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో విద్యార్థులకు పాఠాలు బోధించడానికి కావల్సిన సుద్దముక్కలు కొనుక్కోవడానికి కూడా డబ్బులు లేక ఉపాధ్యాయులు జేబుల్లోంచి ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నుంచి ప్రస్తుతం నూతన ప్రభుత్వం దూరం చేసింది. పాఠశాలల నిర్వహణకు కావల్సిన వస్తు సామగ్రి, కరెంట్ బిల్లులు, రిజిష్టర్ల కొనుగోలు మొత్తం ఈ కాంపోజిట్ గ్రాంట్ నుంచి పొందడం ద్వారా ఉపాధ్యాయులకు ఊరట లభించినట్టయింది. మండల వనరుల కేంద్రంలో ఒకప్పుడు జిరాక్స్ కాపీలకు సొమ్ముల్లేక చేతి డబ్బులు ఖర్చు చేసుకున్న ఎంఈవోలు ప్రస్తుతం మండల వనరుల కేంద్రం గ్రాంట్ విడుదలతో ఊరట చెందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో హెచ్‌ఎంల జేబులకు చిల్లు..

గతంలో పాఠశాలల నిర్వహణ ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రతి పాఠశాలకు వారి విద్యార్థుల హాజరు నమోదు ఆధారంగా రూ.5,000 నుంచి రూ.25000 వరకు నిధుల మంజూరు చేసేవారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే జూన్, జూలై నెలల్లో ఆయా పాఠశాలల విద్యాకమిటీ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. స్కూల్ గ్రాంట్, మెయింటెనెన్స్ గ్రాంట్, టీఎం గ్రాంట్ రూపాల్లో నిధులు మంజూరయ్యేవి. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో గత నాలుగేళ్లుగా పాఠశాల నిర్వహణ ఖర్చులకు సొమ్ములు విడుదల చేయలేదు. గత విద్యా సంవత్సరం పాఠశాల నిర్వహణకు ఒక్క రూపాయి నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధ్యాయులే తమ జేబుల్లోంచి సొమ్ములు వెచ్చించాల్సి వచ్చింది. ఈలోపు బదిలీలు జరగడంతో ఖర్చుచేసిన దానికి నిధులు విడుదల కాక బిల్లులు సబ్మిట్ చేసే అవకాశం లేక వదులుకోవాల్సి వచ్చింది. ఈ విధంగా ఒక్కో పాఠశాల హెచ్‌ఎం ప్రాథమిక పాఠశాల అయితే రూ.10వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.20 వేలుపైచిలుకు ఇక ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు రూ.50 వేల పైచిలుకే చేతి చమురు వదిలించుకున్నారు.

కాంపోజిట్ గ్రాంట్‌తో ఉపయోగాలు

పాఠశాలలకు విడుదల చేయబడిన కాంపోజిట్ గ్రాంట్‌ల ద్వారా పాఠశాలల నిర్వహణ చాలా బాగుంటుందని ఉపాధ్యాయ వర్గాలు వక్కానిస్తున్నాయి. పాఠశాలలకు కావల్సిన సుద్దముక్కలు , రిజిష్టర్లు, పుస్తకాలు, స్టేషనరీ వంటి సామగ్రి కొనుగోలు తోపాటు పాఠశాలలో చేపట్టే జాతీయ పండుగలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చును. మైనర్ రిపేర్లు తో పాటు మేజర్లు రిపేర్లు, ల్యాబ్ వస్తువుల కొనుగోలు, ఆట వస్తువుల కొనుగోలు, వాటర్ ప్యూరిఫైయర్లు రిపేరు , కంప్యూటర్లు, టి.వి ల రిపేరు వంటి వాటికి ఉపయోగించుకోవచ్చని నిబంధనలు చెబుతున్నాయి.

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో కాంపోజిట్ గ్రాంట్ మంజూరు చేయబడిన పీఎంశ్రీ స్కూల్స్, కేజీబీవీ స్కూల్స్, హైస్కూల్ ప్లస్, జూనియర్ కాలేజ్, సొసైటీలకు మంజూరైన గ్రాంట్ల వివరాలు..

పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్స్ సంఖ్య. 1,326
అప్రూవ్ చేయబడిన మొత్తం రూ.3.35 కోట్లు
50 శాతం మంజూరు చేసిన మొత్తం : 1.67 కోట్లు

ఏలూరు జిల్లాలో స్కూల్స్ సంఖ్య 1,578
అప్రూవ్ చేయబడిన మొత్తం - 4.09 కోట్లు
50 శాతం మంజూరు చేసిన మొత్తం : 2.4 కోట్లు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో మంజూరు కాబడిన మండల వనరుల కేంద్రం నిధుల వివరాలు

పశ్చిమ గోదావరి జిల్లా ఎంఆర్‌సీల సంఖ్య 19
మంజూరైన గ్రాంట్ రూ.1,30,000 (ఒక్కొక్కదానికి)
చొప్పున మొత్తం సొమ్ము రూ.24.7 లక్షలు

ఏలూరు జిల్లా ఎంఆర్‌సీల సంఖ్య 28
మంజూరైన గ్రాంట్ రూ.1,30,000 (ఒక్కొక్క దానికి)
చొప్పున మొత్తం సొమ్ము రూ.36.4 లక్షలు

విద్యాసంబంధ కార్యక్రమాలకు ఉపయోగిస్తాం



పాఠశాలకు మంజూరు చేసిన కాంపోజి ట్ గ్రాంట్ ద్వారా పలు విద్యా సంబంధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉపయోగపడతాయి. పీఎంశ్రీ లో మా పాఠశాలలో ల్యాబ్ సౌకర్యం, లైబ్రరీ వసతులు సమకూర్చాం. ఈ నిధులతో విద్యుత్ వసతులు, స్టేషనరీ, జాతీయ పండుగలు, స్వచ్ఛతా కార్యక్రమాలు, నిరుపయోగంగా ఉన్న పాఠశాల వస్తువుల మరమ్మతులకు అవకాశం ఉంటుంది.

- కేబీ భాస్కరరావు, హెచ్‌ఎం, ఉన్నత పాఠశాల (బాలికలు) గణపవరం

ల్యాబ్, స్పోర్ట్స్ వస్తువులు కొంటాం



2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాంపోజిట్ గ్రాంట్‌లో 50శాతం ప్రభుత్వం విడుదల చేసింది. పీఎంశ్రీ స్కూల్స్, కేజీబీవీ స్కూల్స్, హైస్కూల్ ప్లస్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు, సొసైటీలకు నిధులను విడుదల చేసింది. ఈ నిధుల ద్వారా మౌలిక వసతులు, మేజర్, మైనర్ మరమ్మతులు, ల్యాబ్ మెటీరియల్, స్పోర్ట్స్ వస్తువుల కొనుగోలు చేస్తాం.

- పి. శ్యామ్ సుందర్, అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్షా పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం



భీమవరం ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.శ్రీనాథ్

హిందువుల మనోభావాలను అర్థం చేసుకోవాలి

భీమవరంటౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి) : హిందువుల మనోభావాలు, సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాష్ట్ర కార్యనిర్వహణాధికారి సభ్యులు ఎస్.శ్రీనాథ్ అన్నారు. భీమవరంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ క్షేత్రాలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వచ్చే జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారం హిందువుల మనోభావాలను దెబ్బ తీసిందన్నారు. ఆలయాల్లో భక్తులు సమర్పించే ముడుపులు అధికారులు, పాలక మండలి ద్వారా దుర్వినియోగం అవుతున్నాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు ఇతర దేవాలయా లకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. దీని కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించ బోతున్నామన్నారు. విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సంఘచాలక్ మంతెన రామచంద్రరాజు, చింతోజు ప్రసాదు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే దూకి చనిపోతా

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన సొసైటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరావు



శ్రీనివాసరావును వాటరు ట్యాంకు నుంచి కిందకు దింపిన పోలీసులు

చింతలపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : "న్యాయం చేయాలని లేకపోతే దూకి చనిపోతానంటూ' యండపల్లి గ్రామానికి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామంలోని వాటరు ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని తుమ్మల చెరువులో చేపల పెంపకానికి మూడేళ్లకు తీసుకున్న లీజుకు ఇటీవల పూర్తయిందని, అయితే చెరువులో రూ.20 లక్షలకు పైగా విలువ చేసే చేపలు ఉన్నాయని, వాటిని తరలించడానికి దారిలేకుండా మట్టి అడ్డుగా వేశారని ఆరోపించారు. చెరువులోకి అడుగు పెట్టవద్దంటూ కొందరు నాయకులు హెచ్చరికలు చేశారని, మళ్లీ చెరువును చేపల పెంపకం కోసం వేలం వేసేందుకు సిద్ధమయ్యారని, దీనిపై జిల్లా అధికారులకు గడువు పెంచాలని విన్నవించానని, డివిజన్ పంచాయతీ అధికారికి మొరపెట్టినా కుదరదని చెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత్యంతరం లేక వాటరు ట్యాంకు ఎక్కి నిరసన తెలిపానన్నారు. సమాచారం తెలుసుకున్న చింతలపూడి ఎస్‌ఐ కుటుంబరావు ఘటనా స్థలానికి వెళ్లి విషయం తెలుసుకుని కౌన్సెలింగ్ ఇవ్వడంతో శ్రీనివాసరావు ట్యాంకు దిగి రావడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

'సైదు సత్యనారాయణ ఆరోపణలు అవాస్తవం'



విలేకర్లతో మాట్లాడుతున్న పైడిచింతపాడు జనసేన నాయకులు

ఏలూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల అధ్యక్షుడినని చెప్పుకుంటున్న టీడీపీ నాయకుడు సైదు సత్యనారాయణ అవినీతిపరుడు అని, జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి తమవద్ద డబ్బులు తీసుకుని పార్టీలో చేర్చుకుంటుందంటూ ఆరోపణలు చేయడం అవాస్తవం' అని పైడిచింతపాడు జనసేన నాయకులు అన్నారు. ఇటీవల ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో పింఛన్ల పంపిణీ విషయంలో టీడీపీ, జనసేన నాయకుల మధ్య కొట్లాట జరిగిన విషయం తెలిసిందే.. ఈ ఘటనలో సైదు సత్యనారాయణ కుమారుడు నాగరాజు గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామ జనసేన నాయకులు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మిపై సైదు సత్యనారాయణ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పైడిచింతపాడు సర్పంచ్ ముంగర తిమోతి, జనసేన నాయకులు, మాజీ ఎంపీపీ మోరు హైమావతి సుబ్బారావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో చెరువుల్లో చేపలు, రొయ్యలు పట్ట నివ్వకుండా అడ్డుకున్నారని, పట్టుబడి పట్టా లంటే ఎమ్మెల్యేకు రూ.5లక్షలు ఇవ్వాలంటూ తమవద్ద వసూలు చేశాడని ఆరోపించారు. గ్రామంలో మూడు కోట్లు రూపాయలు తాము దారి మళ్లించినట్లు సత్యనారాయణ ఆరోపించాడని, అవి నిజమని నిరూపిస్తే తాము ఊరువదిలి వెళ్ళిపోతామని స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

'భావి పౌరులకు రాజ్యాంగాన్ని పరిచయం చేద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ

తణుకు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'భావిపౌరులకు రాజ్యాంగాన్ని పరిచయం చేద్దాం' అని విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని తరగతి గదుల్లో విద్యార్థులకు సులభంగా బోధించే పద్ధతిపై ఆదివారం ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తణుకులోని విద్యా సంస్థల అధ్యాపకులతో వర్క్‌షాపు నిర్వహించారు. తణుకు స్టడీ సర్కిల్ కార్యదర్శి డాక్టర్ రమేష్ చంద్రబాబు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రచార సమన్వయ కర్త డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి వచ్చిన స్పందన రాజ్యాంగ విలువల పరిరక్షణకు దోహదం చేస్తుందన్నారు. దీనిలో భాగంగా 'రాజ్యాంగ పీఠిక-పద పరిచయం' అంశాన్ని విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ, ప్రాథమిక హక్కులు అంశాన్ని సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకుడు పేరూరి మురళీకుమార్, ప్రాథమిక అంశాన్ని శ్రీశ్రీసేవాసమితి కన్వీనర్ దక్షిణమూర్తి, ఆదేశిక సూత్రాలు అంశాన్ని డిగ్రీ కాలేజీ అధ్యాపకులు విష్ణువర్ధన్ వివరించాయు. వర్క్‌షాపునకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన కళాశాలలు, హైస్కూల్స్‌కి ప్రాతినిధ్యం వహించే 25 సంస్థల నుంచి 40 మంది అధ్యాపకులు 15 మంది ఇతర ప్రముఖులు హాజరయ్యారు. సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపాల్స్ చల్లా హైమావతి, అడ్డాల సత్యనారాయణ, బెల్లంకొండ బుచ్చిబాబు, ఎస్సీఐఎం వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ



రాజమహేంద్రవరంలో ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్‌లోనే తొలి ఎపిసర్ఫ్ మార్పిడి సర్జరీ రాజమహేంద్రవరంలోని సాయి హాస్పిటల్‌లో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఆసుపత్రి ఎండీ డాక్టర్ కురుకూరి విజయ్‌కుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అరుదైన మోచిప్ప మార్పిడి సర్జరీ చేయడం దక్షిణ భారత దేశంలోనే ఇది మూడోవదన్నారు. బెంగళూరులో ఒకటి, హైదారాబాద్‌లో ఒకటి మాత్రమే జరిగాయని, మూడోది రాజమహేంద్రవరం సాయి హాస్పిటల్‌లో చేశామన్నారు. మోచిప్ప అరుగుదలకు సంబంధించి చేసే సర్జరీని ఎపిసర్ఫ్ సర్జరీ అంటారన్నారు. తమ ఆసుపత్రికలో. అమెరికాలో స్థిరపడిన ఎన్‌ఆర్ఐ పేషంట్ మోచిప్పలో ఉన్న అరుగుదలను సరిచేసేందుకు ఇంప్లాట్లను పేషంట్‌కు తగ్గట్టుగా ఇంప్లాంట్ల తయారీ సంస్థలు డిజైన్ చేసి తయారు చేశాయన్నారు. స్వీడన్‌లో వాటిని తయారు చేశాయన్నారు. దానిని తమ ఆసుపత్రిలో తనతోపాటు మంగుళూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు దీపక్ రే, యశోదా హాస్పిటల్ డాక్టర్ పూర్ణచంద్రతేజస్వి కలిసి గంట వ్యవధిలో సర్జరీ పూర్తిచేశామని విజయ్‌కుమార్ చెప్పారు.

క్రైమ్ కార్నర్

రైలు నుంచి జారి పడి ఒడిశా వాసి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చెన్నైకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్తుండగా మార్గమధ్యలో రైలు నుంచి భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్‌ఐ పి.సైమన్ తెలిపిన వివరాలివి.. ఒడిశాకు చెందిన ప్రశాంత్‌కుమార్ గుయా (28) అతడి భార్య రష్మిత ఇతర కుటుంబ సభ్యులు కలిసి భువనేశ్వర్ నుంచి చెన్నైకు జనరల్ బోగీలో వెళ్తుండగా మార్గమధ్యలో భీమడోలు రైల్వే గేటు వద్ద ప్రమాదవశాత్తు అతడు జారిపడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్ళి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాల్వలో పడి ఒకరు..



బాబ్జి మృతదేహం

కైకలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి పంట కాల్వలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన కైకలూరు మండలంలో జరిగింది. టౌన్ ఏఎస్‌ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి.. ఆటపాక గ్రామానికి చెందిన పట్టపు బాబ్జి(48) భార్య కొంతకాలం క్రితం చనిపోగా కుమారుడు గత ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కాగా వేర్వేరు ప్రాంతంలో ఉన్నారు. గ్రామంలోని తన సోదరి ఇంటి వద్ద జీవిస్తున్నాడు. కుమారుడు చనిపోయినప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగివచ్చి స్నానానికై పంట కాల్వలోకి దిగి మునిగిపోయమాడు. స్థానికులు గమనించి వెంటనే కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అప్పగించామని ఏఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఉంగుటూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరులో గత నెల 17న పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉంగుటూరులో హైవే పక్కన నివాసముంటున్న నెక్కలపూడి రామయ్య(36) అనే వ్యక్తికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడికి నాచుగుంటలో వున్న ఓ మహిళతో సంబంధం ఉండడంతో దంపతుల మధ్య ఏడాది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో గతనెల 17న ఉదయం రామయ్య నాచుగుంటలో వున్న మహిళ ఇంటి వద్ద పురుగుల మందు తాగి పడిపోయా డు. ఈ విషయం తెలుసుకున్న ఆమె ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందు తూ ఈనెల రెండున మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చిట్టీల సొమ్ముతో వ్యక్తి పరార్..

బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

చింతలపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడిలో కొన్నేళ్లుగా చిట్‌ఫండ్ పెట్టి చిట్టీల పేరుతో సొమ్ములు వసూలు చేసి లక్షల రూపాయలతో సుబ్బారావు అనే వ్యక్తి పరారైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆదివారం కొంత మంది బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడికి కొంతమంది చిట్టీలు కట్టారని, సొమ్ములు ఇవ్వలేదని కొంత మందికి చివరి దశకు వచ్చినా ఇవ్వలేదని వారం రోజులుగా కనపడడం లేదని, ఫోన్‌లు చేసినా సమాధానం ఇవ్వడం లేదన్నారు. బాధితులు మాట్లాడుతూ తన పేరు పద్మావతి అని చిల్లర కొట్టు నడుపుకుంటు న్నానని, భర్త దయాలసిస్ పేషెంట్ అని ఆపదలో ఉపయోగపడతాయని చిట్టీ వేస్తే అది పూర్తయిన రెండు నెలల నుంచి సొమ్ములు ఇవ్వడంలేదని, వారం రోజులుగా ఫోన్ చేసినా సమాధానం ఇవ్వడం లేదని వాపోయింది. మరో బైక్ మెకానిక్ కిరణ్ మాట్లాడుతూ రూ.పది లక్షలు విలువైన చిట్టీ వేశానని, పూర్తి కావచ్చిందని, ఇంతలో పరారయ్యాడన్నారు. పండ్ల కొట్టు ప్రమీల, కిరాణా షాపు మురళీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ కుటుంబరావు మాట్లాడు తూ అతడు పరారైన మాట వాస్తవమేనని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వృద్ధురాలిపై అత్యాచార యత్నం.. కేసు నమోదు

ఉండి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అరవై ఐదేళ్ల వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన ముప్పై తొమ్మిదేళ్ల వ్యక్తి అత్యాచారయత్నానికి ఒడిగట్టిన ఘటన ఉండి మండలంలో జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి ఎస్‌ఐ మహ్మద్ నజీరుల్లా తెలిపారు. ఉండి మండలంలో ఓ గ్రామానికి చెందిన వృద్ధురాలు ఇంటిలో ఒంటరిగా వుండడం చూసి కాసుమళ్ల రమేష్ అనే వ్యక్తి శనివారం అర్థరాత్రి ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై దౌర్జన్యం చేసి నాలుగు వేల రూపాయలు లాక్కుని, అత్యాచారానికి ప్రయత్నించాడు. ఆదివారం వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కోడి పందేలపై దాడి.. ఎనిమిది మంది అరెస్ట్

కొయ్యలగూడెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోడి పందేల శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశామని ఎస్‌ఐ కే.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని గంగవరం శివారు ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఎనిమిది మంది అరెస్ట్ చేసి, రూ.61 వేల నగదు, ఆరు మోటారు సైకిళ్లను, మూడు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆ ముగ్గురిపై 'ఎక్స్'లో పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు

పాలకోడేరు, నవంబరు3 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా రాజకీయ వైషమ్యాలను రెచ్చగొడుతూ 'ఎక్స్'లో పోస్టులు పెట్టిన వ్యక్తిపై పాలకోడేరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు కడిమి కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పాలకోడేరు రైటర్ హజరయ్య ఆదివారం తెలిపారు. పాలకోడేరుకు చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో సోషల్‌మీడియా వేదికగా రాజకీయ వైషమ్యాలను రెచ్చగొడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, జనసేన నేత పవన్‌పై పోస్టులు పెట్టారని తెలిపారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేశామని రైటర్ తెలిపారు.



బిర్యానీ ప్యాకెట్‌లు అందిస్తున్న బాబ్జి

రూ.5కే బిర్యానీ

తాడేపల్లిగూడెం రూరల్ నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ మధ్య రెస్టారెంట్‌ల ప్రారంభోత్సవంలో పాత రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయల నోట్లకు బిర్యాని ఇస్తామని ఆఫర్ పెట్టడం ట్రెండింగ్ అయిపోయింది. తాడేపల్లిగూడెంలో ఇటీవల ఆ రకమైన ఆఫర్‌లు ఇస్తూ కస్టమర్లను ఆకర్షిస్తున్నారు. ఆదివారం తాడేపల్లిగూడెంలోని ఓ దాబా రెస్టారెంట్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ప్రారంభించి రూ.5కే బిర్యానీలను అందిం చారు. ఈ ఆఫర్ కోసం వందల సంఖ్యలో జనాలు క్యూ కట్టారు.

కొండ్రుప్రోలులో చేతబడి కలకలం !

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు కాలనీలో ఇంటి ముందు పసుపు కుంకుమ, నిమ్మకాయలు కనిపించడంతో చేతబ డి చేశారంటూ కలకలం రేగింది. కాల నీలోని జగనన్న కాలనీలో నీలం రమేష్‌కు చెందిన ఇంటి గేటు ముందు ఆదివారం ఉదయం లేచి చూసేసరికి నిమ్మకాయలు, మిరపకాయలు, పసుపు, కుంకుమ దర్శనమిచ్చాయి. తమపై గిట్టని వారు చేతబడి చేసి ఉంటారని ఆయన కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పీఎంపీ వైద్యుడిపై కేసు

మొగల్తూరు, నవంబరు 3, (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్య వైఖరితో వైద్యం చేసిన పీఎంపీ వైద్యుడిపై కేసు నమోదు చేశామని మొగల్తూరు పోలీసులు ఆదివారం తెలిపారు. కాళీపట్నం గ్రామానికి చెందిన పీఎంపీ వైద్యుడు కటికరెడ్డి జగన్నాధరావు అదే గ్రామానికి చెందిన పితాని రాజుకు నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా వైద్యం చేయడంతో ఆ వైద్యం వికటించిందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు ఎస్‌ఐ జి.వాసు తెలిపారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు పట్టివేత

పెదపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న పెదపాడు శివారు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పెదపాడు ఎస్‌ఐ కట్టా శారదసతీష్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్‌తో పాటుగా చెరువు యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

లింగంపాడులో..

భీమడోలు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల వ్యర్థాలను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని భీమడోలు పోలీసులు తెలిపారు. భీమడోలు శివారు లింగంపాడులో చేపల చెరువులకు హైదరాబాద్ నుంచి కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ వ్యాన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన ఇల్లూరు వెంకటావు అనే వ్యక్తి వ్యానులో వ్యర్థాలు తరలిస్తున్నట్టు తెలిపారు. సంబంధిత చెరువు యజమాని, కోళ్ల వ్యర్థాలు సరఫరా చేస్తున్న వెంకటరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

పెదవేగి, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : జానంపేట పంచాయతీ ప్రకాష్‌నగర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. దాడిలో ముగ్గురు జూదరులతో పాటు రూ.3200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఫ్లై వోవర్‌పై రక్షణ లేని ప్రయాణం

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగ రంలో జూట్‌మిల్లు సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు అండర్ రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి నిర్వహణను పాల కులు పట్టిం చుకోక పోవడంతో ప్రమాదకరంగా మారింది. జూట్‌మిల్లు నుంచి ఫ్లై వోవర్ ఎక్కేట ప్పుడు ఎడమ వైపున దాదాపు మూడు గజాలు పొడవు గల రక్షణ గోడ గతంలోనే కూలిపో యింది. అదేవి దంగా ఈ బ్రిడ్జిపై దిగేటప్పుడు రోడ్డుకు ఎడమ వైపున మరోచోట దాదాపు ఐదు గజాలు పొడవు గల రక్షణ గోడ గతంలోనే కూలి పోయి ప్రమాదక రంగా మరింది. పాలకులు పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు అటుగా చూడరేమో.


ఫ్లైవోవర్‌పై కూలిన రక్షణ గోడ

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే చంటి


టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీఆర్ నాయుడును ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మర్యాద పూర్వకంగా హైదరాబాదులో ఆదివారం కలిశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


నాయకులతో మట్లాడుతున్న రోషన్‌కుమార్

లింగపాలెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని గ్రామా లు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో ఇటీవల మరణిం చిన తెలుగుదేశం కార్యకర్త ఎం.తిరుమలాదేవి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శి ంచారు. అనంతరం గ్రామంలోని కూటమి నాయకులతో సమస్యలపై చర్చించారు. అంతర్గత రహదారులు, తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. కూటమి నాయకులు ఉన్నారు.

నేడు శంకుస్థాపన

కామవరపుకోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద రూ. 50 లక్షలతో నిర్మించనున్న కనస్ట్రక్షన్ ఆఫ్ బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ల్యాబ్ గదులు నిర్మించేందుకు సోమవారం ఉదయం 10.30 గంటలకు చింత లపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శంకుస్థాపన చేస్తారని, కార్యక్ర మానికి కూట మి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని మండల తెలుగుదేశం అధ్యక్షులు కె.సత్యనారా యణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

6న ఖాదీ గ్రామీణ రుణ మేళ

చింతలపూడి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఆరో తేదనీ ఖాదీ గ్రామీణ రుణమేళ అవగాహన సదస్సు జరుగుతుందని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ తెలిపారు. ఈ సదస్సులో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ అదనపు డైరెక్టర్ విజయకుమార్, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ కమిషనర్ క్రీపి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, పలువురు అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువ తను ప్రోత్సహించడానికి, గ్రామీణ పరిశ్రమల స్థాపనకు అవగాహన సదస్సు పెట్టామని, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఇందు లో పాల్గొనాలని పలువురు రాష్ట్ర జిల్లా అధికా రులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు.

9న అమరవీరుల సంస్మరణ సభ

కుక్కునూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ విప్లవోద్యమంలో భూమి భుక్తి కోసం పోరాడి అమరులైన వారికి ఈ నెల 9న జరిగే స్మారక సభను విజయవంతం చేయా లని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ పిలుపు నిచ్చారు. కుక్కునూరులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక మనిషిని మరో మనిషి దోపిడీ చేసే సమాజం ఉండకూడదని పీడనలేని వ్యవస్థ కోసం పని చేసి ఎందరో అమరులయ్యారని, వారిని స్మరిస్తూ జంగారెడ్డిగూడెం డివిజన్‌లో సంస్మ రణ సభ నిర్వహిస్తున్నమన్నారు. పార్టీ శ్రేణు లు స్మారక సభను విజయవంతం చేయా లని కోరారు. జిల్లా నాయకులు సత్యనారా యణ, ఎస్.రామారావు, జి.ముత్యాలరావు, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ జడ్జి


శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న జడ్జి గుప్తా

ద్వారకాతిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయా న్ని దేవదాయశాఖ ట్రిబ్యునల్ జడ్జి హరినాథ్ గుప్తా ఆదివారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యే క పూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేష వస్త్రం ఇచ్చి వేదాశీర్వచనం అందించారు. ఆల య అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసా దం అందజేశారు.

అమరుల స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలి

బుట్టాయగూడెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమరుల స్ఫూర్తితో సమస్యలపై ఐక్యతతో పోరాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పి.శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నాగన్నగూడెంలో నాగన్న, గంగిరెడ్డిలో గల స్థూపం వద్ద కొండరెడ్లతో కలిసి నివాళులర్పిం చారు. అనంతరం పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లత అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడారు. అమరులు తమ జీవితా లను సమాజ మార్పుకోసం, నూతన సమాజం కోసం త్యాగం చేశారని, వారి కలలను నిజం చేస్తూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు బలమైన ఉద్యమాలు నిర్వహిం చాలన్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కళ్యా ణ్ అడవులను విస్తరిస్తామని చెప్పారని, అందులో ఆదివాసీల భూములను కలుపుకుని వారి భూముల నుంచి గెంటివేసే కుట్ర దాగి ఉందన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ఆదివాసీలు లక్షల ఎకరాల పోడుకొట్టి పోడునే జీవనాధారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తూనే ఉన్నారని పట్టాలు ఇవ్వని ప్రభుత్వం అడవుల విస్తరణ పేరుతో గెంటివేసే కుట్రకు తెరలేపిందన్నారు. దానిని ఐక్యంగా ఆదివాసీలు ఏకమై తిపికొట్టాలన్నారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి పాలక వర్గాలు పరుగులు తీస్తున్నాయని, పోరాటాలు ద్వారానే వాటిని అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. చిన్నారెడ్డి, బాబు లీరెడ్డి, పండురెడ్డి, శ్రీరామ్మూర్తిరెడ్డి, కొండరెడ్లు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కొండరెడ్లు

మౌలిక సదుపాయాలు కల్పించాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న దళితులు

బుట్టాయగూడెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి కేవీపీఎస్ ఆధ్వర్య ంలో దళితులు వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, కమ్యూనిటి హాల్ నిర్మాణం, దళితపేటలో ఇళ్ల పై నుంచి వెళుతున్న 11 కేవీ విద్యుత్ లైన్ మార్పు చేయాలని ఎ.ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో దళితులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సమస్య లపై స్పందించిన ఎమ్మెల్యే 11 కేవీ విద్యుత్ లైన్‌ను మార్పు చేయిస్తానని, కాలనీలో మౌలి క సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చా రు. కాలనీవాసులు మంగకుమారి, వెంకాయ మ్మ, మార్తమ్మ, సుజాత, మందానికి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

రామారావు మృతికి సీపీఎం సంతాపం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక గాంధీనగర్ ప్రాంతానికి చెంది న సీనియర్ సీపీఎం నాయకులు సువ్వాడ రామారావు(85) మృతికి స్థానిక కార్యాల యంలో ఏలూరు నగర కమిటీ ఆదివారం సంతాప సభ నిర్వహించింది. రామారావు చిత్రపటానికి నగర కార్యదర్శి పి.కిషోర్, కె.విశ్వ నాధం, ఎం.ఇస్సాకు, ఎం.సత్యం, కె.బలరాం గౌడ్, నాగేశ్వరరావు, నాగేంద్ర, ఎం.రామారావు, శ్రీను తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీకి రామా రావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

ఆ శివాలయం
పంచాయతీరాజ్‌కు చెందిందే!

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో ఉన్న శివాలయం పంచాయతీరాజ్ కార్యాలయా నికి చెందిందని ఈఈ కె.శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. 1985లో అటెండర్‌గా పనిచేస్తున్న జి.నాగేశ్వరరావు శివలింగాన్ని, నందీ శ్వరుడు విగ్రహాన్ని పంచాయతీరాజ్ కార్యాలయ ప్రధాన ద్వారం సమీపంలో ఉంచి పూజలు చేసేవారన్నారు. అనంతరం తమ శాఖ ఉద్యోగు ల విరాళాలలతో శివలింగాన్ని, నందీశ్వరుడు విగ్రహాలకు గది నిర్మించి, పూజారిని, స్వీపర్‌ని ఏర్పాటు చేశారని ఈఈ శ్రీను తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఆర్థిక సాయంతో 2014లో కాశీ నుంచి శివలింగం, నందీశ్వరుని విగ్రహాలు తీసుకువచ్చి ప్రతిష్ఠించారన్నారు. అప్పటి నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చేవారన్నారు. దీంతో పంచాయతీరాజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేర కు సిబ్బందితో ఆలయ నిర్వహణ కమిటీ ఏర్పా టు చేసి 2024 వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చామన్నారు. కానీ గతేడాది కార్తీకమాసంలో కొందరు బయటి వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీలను ఏర్పాటు చేసి శివాలయానికి తాళాలు వేశారన్నారు. ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయటం, భక్తులు ద్విచక్ర వాహనాలు కార్యాలయ ఆవరణ పెడుతుండడం తో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదించామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఈఈ తెలిపారు.


శివాలయంలో ఉన్న స్వామివారి విగ్రహాలు, నందీశ్వరుని విగ్రహాలు

జనవరి 5న హైందవ శంఖారావం

ఏలూరు రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందు దేవాలయాలను హిందు ధార్మిక సంఘా లకు అప్పగించాలనే డిమాండ్‌తో జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, విశ్వ హిం దు పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్రరాజు, వేణుగోపాలరాజు అన్నారు. ఏలూరులోని గ్రాండ్ కృష్ణా కల్యాణ మండపంలో ఆదివారం హైందవ శంఖారావం, జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యాజ్ఞ వల్కా రాజాశ్రమాధిపతులు కృష్ణచరణానంద భారతీ స్వామి, వీహెచ్‌పీ, క్షేత్రప్రతినిధి కె.సూర్యప్రకాష్, ఏలూరు జిల్లా సంఘచాలక్ జి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనం తరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వేణుగోపాలరాజు మాట్లాడుతూ నాలుగు లక్షల మందితో విజయవాడలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావ సభ ద్వారా దేశవ్యాప్తంగా హిందు ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తిచేసి స్వయంప్రతిపత్తి కలిగిన ధార్మిక సంఘాలకు అప్పగిస్తూ చట్టం చేయాలని వీహెచ్‌పీ జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డులలో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా హిం దు దైవ భక్తులకు మాత్రమే స్థానం కల్పిం చాలని, హైందవ శంఖారావ సభకు పెద్ద సంఖ్యలో హిందువులు తరలిరావాలని పిలుపుని చ్చారు. ఈ సందర్భంగా హైందవశంఖారావం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కొండ కాలువల పూడికతీత



పోలవరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటుకలకోట కొండకాలువల పూడికతీత పను లు ఆదివారం అధికారులు నిర్వహించారు. ఆరేళ్ల క్రితం కొండవాగుల దాటికి ఇటుకలకోట గ్రామం ఒకే ఏడాది మూడుసార్లు ముంపునకు గురై నివాసాలు కొట్టుకుపోయాయి. దీంతో ఏటా అధికారులు కొండవాగుల నీరు బయట కు పోయేలా చర్యలు తీసుకుంటు న్నారు. కొండవాగుల జలాలు పోలవరం ప్రాజెక్టు కుడి కాలువ కింద నుంచి బయటకు పోవడానికి వీలుగా జలవనరుల శాఖ అధికారులు నిర్మిం చిన అండర్ టన్నెల్ డ్రైన్ పూడుకుపోవడంతో కొండవాగుల దాటికి తరచూ ఇటుకలకోట గ్రామం ముంపునకు గురవుతుంది. ఈ నేపథ్య ంలో పూడికతీత పనులు నిర్వహించి నట్టు ఎంపీడీవో ఇ.శ్రీనివాస్ తెలిపారు.

నేడు కామ్రేడ్ కారం పార్వతి వర్ధంతి



మనుగోపల గ్రామంలో కామ్రేడ్ కారం పార్వతి వర్ధంతి ఏర్పాట్లు

పోలవరం నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కామ్రేడ్ కారం పార్వతి 27వ వర్ధంతిని జయ ప్రదం చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం, ఏజెన్సీ గిరిజన సంఘం ఆదివారం పిలుపు నిచ్చింది. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ పోలీసు ల తుపాకీ కాల్పులలో అమరులైన కామ్రేడ్ కారం పార్వతి వర్ధంతిని మనుగోపలలో పార్వతి స్మారక స్థూపం వద్ద సోమవారం నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సభలో ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎంఎస్ నాగరాజు, షేక్ భాషా, జిల్లా నాయకు లు ఎస్.రాంబాబు, పాల్గొంటారన్నారు. ఆదివా సి కళాకారుల కళారూపాల ప్రదర్శన ఉంటు ందన్నారు.

పిరమిడ్ సేవాదళ్ శాకాహార ర్యాలీ

భీమడోలు, నవంబరు 03 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. పిరమిడ్ సేవాదళ్ ఆశయాలను ప్రతి ఒక్క రు ముందుకు తీసుకువెళ్ళాలని తాడేపల్లిగూడెం పిరమిడ్ సేవాదళ్ మాస్టారు గోవిందయ్య అన్నారు. భీమడోలు సాయిబాబా గుడి దగ్గర నుంచి శాఖాహార ర్యాలీ ప్రారంభమైంది. పిరమిడ్ సేవాదళ్ ప్రతినిధులు పి.అప్పారావు, రంగారావు, గిరిబాబు, ఇ.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నా రు. ఈ నెల 11న తూర్పుగోదావరి జిల్లా పేరవరం నుంచి అతి పెద్ద వశిష్ట గోదావరిపై ఏర్పాటు చేసిన పిరమిడ్‌ను ప్రారంభం కానున్నదని ఈ సందర్భంగా తెలిపారు.


భీమడోలులో ర్యాలీ చేస్తున్న పిరమిడ్ సేవాదళ్ సభ్యులు

వక్ఫ్ భూముల పరిరక్షణకు సహకరించాలి

జంగారెడ్డిగూడెం నవంబరు 3, (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ భూములు పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ముస్లీం నాయకుడు షేక్ ముస్తఫా అన్నారు. విజయవాడ లో ఆదివారం జరిగిన వక్ఫ్ పరిరక్షణ మహాసభకు జంగారెడ్డిగూడెం నుంచి ముస్లీంలు తరలివెళ్లారు. ముస్తఫా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ భూముల చట్టంలో మార్పు చేయడా నికి ఆగస్టులో పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టిందన్నారు. ఆ బిల్లు పాస్ అయితే దేశ వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ భూములకు, ముస్లీంలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. నాయకులు షేక్ బాజీ షేక్ యాకూబ్, అబ్దుల్ షాహీన్, షేక్ ముస్తాక్ అహ్మద్, తదితరులు ఉన్నారు.


విజయవాడ వక్ఫ్ పరిరక్షణ మహాసభకు తరలివెళ్లిన ముస్లీం నాయకులు

టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరం చేద్దాం

ద్వారకాతిరుమల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం గ్రామ కమిటీ అధ్యక్షుడు నరం త్రిమూర్తులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. యాదవ కల్యాణమండప ఆవరణలో జరిగిన ఈ సమావేశంలో త్వరలో జరుగనున్న పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ల ఓట్ల నమో దుపై చర్చించారు. టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. ఇమ్మడి రత్నా జి, కూరాకుల బుజ్జి, గువ్వల మావుళ్లు, రేవూరి వెంకటేశ్వరరావు, వీరి శెట్టి రామారావు, మణి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో చర్చించుకుంటున్న నేతలు

ఓటరుగా నమోదు కావాలి

కామవరపుకోట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలని మండల టీడీపీ అధ్యక్షులు కె.సత్యనారాయణ సూచించారు. డిగ్రీ ప్రొవిజినల్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్ కార్డు, ఓటరు కార్డు జిరాక్సు పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ నెంబర్‌తో ఫారం-18తో జత పర్చాలన్నారు. ఆఫ్ లైన్‌లో ఓటు నమోదు చేయించుకునేవారు జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో అటెస్టేషన్ చేయించి సమీప నిర్దేశిత కేంద్రాల్లో అందచేయాలన్నారు.

రోడ్డ ప్రమాదంలో అక్కా చెలెళ్లు మృతి

ఏలూరు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని నిద్ర మత్తులో ఉన్న కారు డ్రైవర్ ఢీ కొనడంతో అక్కా చెల్లెళ్ళు మృతి చెందగా డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఉదయం 5.30 గంటలకు జరిగింది. అనంతపురంనకు చెందిన అనంతపు రంలోని శ్రీసత్యసాయి విద్యాసంస్థలలో ప్రొఫెసర్ గా పని చేసి పదవీ విరమణ చెందిన కనకదుర్గ (84) వివాహం కాలేదు. ఆమె సోదరి రాజేశ్వరి (87)తో కలిసి ఉంటున్నారు. రాజేశ్వరికి కూడా వివాహం కాలేదు. వీరిద్దరికి సంబంధించిన ఆస్తులు కాకినాడలో ఉన్నాయి. మూడు నెలలకు ఒకసారి వెళ్లి అద్దె సొమ్ములను వసూలు చేసు కుని వస్తూ ఉంటారు. దీనిలో భాగంగా అద్దె సొమ్ము వసూలు చేసుకోవడానికి వారివద్ద డ్రైవర్‌గా పనిచేసే అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామనేపల్లి గ్రామానికి చెందిన సొకే సూర్యనారాయణ (45) ఈ నెల 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు అనంతపురం నుంచి కాకినాడకు కారులో వీరిద్దరు బయలుదేరారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో విజయవాడ దాటిన తరువాత ఓ పెట్రోల్ బంక్ వద్ద కారు పక్కన పెట్టి నిద్రించారు. తిరిగి 4.30 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యలో నల్లజర్ల మండ లం పుల్లలపాడు వద్ద జాతీయ రహదారిపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఒక లారీ ఆగి ఉంది. దీంతో దానిని గమనించక డ్రైవర్ కారుతో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో కనకదుర్గ అక్కడిక క్కడే మృతి చెందిగా తీవ్ర గాయాలపాలైన రాజేశ్వరి, సూర్యనారాయణను ఏలూరు ప్రభు త్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి వచ్చిన కొద్ది సేపటికే రాజేశ్వరి మృతి చెందింది. ఐసీయూ లో సూర్యనారాయణ చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై నల్లజర్ల పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రి మార్చురీకి మృత దేహాలను తరలించారు. బంధువులకు పోలీసులు సమాచామిచ్చారు.

ఉపాధ్యాయులకు పని భారం తగ్గించాలి


ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పని భారాన్ని తొల గించాలని, బోధనకే పరిమితం చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. పదో తరగతి పరీక్షలు తెలుగులో కూడా రాసుకునే వెసులుబాటు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠ శాలల్లో టీచర్లు, విద్యార్థుల సమస్యలపై సర్వే, సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాల వివరా లను ఆదివారం ఇక్కడ పత్రికలకు విడుదల చేశారు. స్కూలుకు ఇద్దరు టీచర్లు ఉండేలా చర్యలు తీసుకోవాల, ఇంటర్మీడి యట్ తరగ తులను యదాతథంగా కొనసాగించి, పోస్టుల ను భర్తీ చేయాలని, వివిధ కేడర్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాల ను తక్షణమే అప్‌డేట్ చేసి, విడుదల చేయా లన్నారు. సర్వేలో సేకరిం చిన విషయాలను క్రోడీకరించి విద్యా శాఖ ఉన్నతాధికారులకు త్వరలో అందజేస్తామన్నారు.

ఆధ్యాత్మికం

గంగానమ్మకు అభిషేకం

ఏలూరు కార్పొరేషన్/పెదపాడు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో తొలి ఆదివా రాన్ని పురస్కరిం చుకుని గ్రామదేవత గంగాన మ్మకు పెదపాడులో వెయ్యి బిందెల నీళ్లతో అభిషేకం చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు మంచినీటి చెరువు నుంచి నీళ్ల బిందెలతో ఊరేగింపుగా గంగానమ్మ గుడి వరకు ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నీళ్లతో అభిషేకాలు నిర్వహి ంచారు. అనంతరం గంగానమ్మను ప్రత్యేక అలం కరించారు. గంగానమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఏలూరు నగరంలోని పలు డివిజన్ల లో గల గ్రామదేవత గంగానమ్మ ఆల యాల వద్ద ఆదివారం ఆయా ప్రాంతాలకు చెంది న ప్రజలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలతో అర్చనలు చేసి, పోతురాజుబాబు సన్నిధిలో చలివేపారాలు, వేడిమిపారాలు సమర్పించారు.

రాట్నాలమ్మకి ప్రత్యేక పూజలు

పెదవేగి : రాట్నాలకుంట రాట్నాలమ్మకి ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.20,570లు, లడ్డూ ప్రసా దాల విక్రయాల ద్వారా రూ.18,510లు, ఫోటో విక్రయాల ద్వారా రూ.2780లు ఆదాయం వచ్చిందని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.




ప్రత్యేక అలంకరణంలో గంగానమ్మ, రాట్నాలమ్మ, సూర్యనారాయణ దేవునికి పంచామృతాభిషేకం

వైభవంగా మద్ది ఆంజనేయుని కల్యాణం

జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థానంలో కార్తీక మాసో త్సవాలలో స్వామి వారి కల్యాణం ఆలయ అష్టోత్తర మండపంపై అర్చకులు ఘనంగా నిర్వహించారు. వివిధ సేవల రూపంలో రూ. లక్షా 36 వేల 544లు ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

ధన్వంతరి వైద్య భగవానునికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్ : పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భక్తులు సామూహికంగా అభిషేకాలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రదిక్షణలు నిర్వహించి సూర్య నమస్కార పూజ లు చేశారు. అర్చకుల ద్వారా రక్షాబంధనాలను కట్టించుకున్నారు. రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగే శ్వరస్వామి ఆలయం, అగ్రహారంలోని పాత శివాలయం, నగరేశ్వరాలయం, సత్రంపాడులోని అంబికాదేవి ఆలయం, సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయం, బావిశెట్టివారిపేట, సత్యనారాయణపేట, నాగేశ్వ రపురంలలోని కాశీ విశ్వేశ్వరాలయాల వద్ద నిరంతరం ఆకాశ దీప కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కార్తీక వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు : కాకినాడ జిల్లా జి.వేమవరంలో జరిగిన క్షత్రియ పరిషత్తు వారి కార్తీక వన సమారాధనలో ఎమ్మెలేయ పత్సమట్ల ధర్మరాజు హాజరై సేవా సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ధర్మరాజును క్షత్రియ పరిషత్తు ఘనంగా సత్కరించింది

బాలుడి ఆచూకీ లభ్యం



ఏలూరు క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దీపావళి సెలవులకు నానమ్మ ఊరు వెళ్ళిన ఒక విద్యార్థి ఆ ప్రాంతంలోని కొంత మంది విద్యార్థులతో ఆడుకోవడానికి వెళ్లి అదృశ్యమ య్యాడు. ఎంత వెతికినా ఆచూకీ కానరాలేదు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గంట వ్యవధిలోనే బాలుడి ఆచూకీ కనుకొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హైదరా బాద్‌లోని ఓ పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న బాలుడు తన నానమ్మ ఊరు అయిన యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామానికి దీపావళి సెలవులు నిమిత్తం తన సోదరుడితో కలిసి వెళ్ళాడు. ఆదివారం మధ్యాహ్నం ఆ ప్రాంతంలో ఉన్న విద్యార్థులతో కలిసి ఆడుకోవడానికి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. ఆ గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ కానరాలేదు. సాయంత్రం వరకూ వెతికి చివరకు 7 గంటల ప్రాంతంలో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ బాలుడు అమ్మమ్మ ఊరు అయిన ఏలూరు కావడంతో ఈ ప్రాంతానికి వచ్చి ఉండవచ్చునని భావించి యలమంచిలి పోలీసులు జిల్లా పోలీసులకు సమాచారం ఇచ్చారు. త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, ఎస్ఐలు ప్రసాద్, రాంబాబు, హెడ్‌కానిస్టేబుల్ విజయరాజు, సిబ్బంది గాలించి బాలుడిని కనుగొని ఏలూరులో ఉన్న బంధువులకు అప్పగించారు. హైదరాబా ద్‌లో ఉన్న ఆ పబ్లిక్ స్కూల్‌లో చదవడం ఇష్టం లేదని గతంలో విజయవాడలో ఉన్న ఆ పబ్లిక్ స్కూల్‌లోనే చదువుతానంటూ తన మాట పట్టించుకోవడం లేదని ఎటో కటు వెళ్ళిపోవాలని వచ్చినట్లుగా పోలీసులు వెల్లడించారు. అతనికి నచ్చజెప్పి బంధువులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.


తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు భోజనాలు

సేవే దైవం..

రోగుల ఆకలి తీరుస్తున్న సత్యసాయి ట్రస్టు

భీమవరం క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తణుకు, తాడేపల్లి గూడెం, భీమవరం, పాలకొల్లు, ఏలూరు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు, వారికి తోడుగా వచ్చిన బంధువులకు సత్యసాయి ట్రస్టు ఆకలి తీరుస్తోంది. భీమవరంలో 8 సంవత్సరాలుగా ప్రభుత్వాసుపత్రి పైఅంతస్తులో ట్రస్టు భోజనశాల ఏర్పాటు చేసి ఆహారాన్ని అంది స్తున్నది. రోజుకు 50 నుంచి 70 మంది వరకు ఆహారాన్ని స్వీకరిస్తారని ట్రస్టు సభ్యులు చెబుతున్నారు. పది మంది సభ్యులు సేవ చేస్తున్నట్టు తెలిపారు. అన్నదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తు న్నట్టు సభ్యులు పేర్కొన్నారు.

● తణుకు: తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి లోని సత్యసాయి ట్రస్టు నిత్యం అన్నప్రసాదం అందిస్తున్నారు. ఎంతో దూరం నుంచి ఆసుపత్రి కి వచ్చి వైద్యం చేయించుకుంటున్న రోగి బంధు వులకు ఆకలిని తీరుస్తుంది. 2017లో అన్న ప్రసా దం అందించేందుకు వసతి కావాలని అప్పటి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ దృష్టిలో పెట్టగా, అప్పటి కలెక్టర్ కాటంనేని భాస్కర్ భవనం కేటాయించారు. ఆరోజు నుంచి ఇప్పటికి ఎనిమిది సంవ త్సరాల నుంచి నిరంతరాయంగా అన్న ప్రసాదం అందిస్తు న్నారు. ప్రతి రోజు రోగి బంధువులకు వంద మందికి భోజనాలు పెడ తారు. ఇక సాయి భక్తులు తణుకు చుట్టు పక్క లు 30 గ్రామాల్లో ఉన్నారు. రోజుకు ఒక గ్రామం చొప్పున భక్తులు ఏ గ్రామం నుంచి రావాలో ముందుగానే సమాచారం ఇస్తారు. ఆవిధంగానే ప్రతిరోజు నాలుగు నుంచి ఆరుగురు భక్తులు వచ్చి సేవలందిస్తుంటారు.

● తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలోనే ఐదేళ్లుగా ట్రస్ట్ సేవలు అందిస్తోంది. ఉదయం సాయం త్రం రెండుపూటలా వంద మందికి పైగా అన్న దానం నిర్వహిస్తున్నారు. ట్రస్ట్ సహకారంతో కొంత, దాతల సహకారంతో మరికొంత రోగు లకు, రోగుల చెంతకు వచ్చే బంధువులకు అన్న దానం చేస్తున్నారు. కరోనా విపత్కర సమయం లోనూ సభ్యులు భయపడకుండా అన్నదానం కొనసాగించారు. ఇళ్ల వద్ద ఉంటూ వైద్యం పొందుతున్న రోగులకు ఇళ్లకే పార్శిళ్లను అందించేవారు.



ద్వారకాతిరుమల చిన వెంకన్నకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): శ్రీనివాసా.. గోవిందా శ్రీవెంకటేశా గోవిందా అంటూ గోవింద నామస్మరణలతో ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రం మారు మోగింది. కార్తీకమాసంలో మొదటి ఆదివారం కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో పోటె త్తింది. దాదాపు 20 వేల మంది పైబడి యాత్రి కులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. సెలవుదినం కార్తీక పర్వదినాలు కావడంతో అధిక సంఖ్యలో యాత్రికులు క్షేత్రానికి చేరుకుని క్యూలైన్లలో శ్రీవారి దర్శనం కోసం వేచి చూశారు. చెట్లవద్ద పలువురు మహిళలు కార్తీక దీపాలను వెలి గించారు. అనంతరం వకుళమాత అన్నప్రసాద భవనంలో ప్రసాదాన్ని స్వీకరించారు. సాయం త్రం వరకూ రద్దీ కొనసాగింది.



పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల సందడి

మొగల్తూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం మొదటి ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి సందర్శకులు పేరు పాలెం బీచ్‌కు, భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ ఉన్నా తర్వాత మబ్బులుగా ఉండి వాతావరణం చల్లబడింది. సుమారు 5 వేల మంది పర్యాటకులు బీచ్‌ను సందర్శించారని అధికారులు అంచనా వేస్తున్నారు.ఆర్డీవో దాసి రాజు బీచ్‌ను సందర్శించి పలు సూచనలు చేశా రు. డీఎస్పీ ఎంబీఎస్ మురళీ కృష్ణ పర్యవేక్షణలో సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఐదుగురు ఎస్ ఐలు, 90 మంది సిబ్బందితో బందోబస్త్ ఏర్పాట్లు చేశారు. సముద్ర స్నానం చేసేవారు ఎక్కువ దూరం సముద్రంలోకి వెళ్లకుండా సుమారు 150 మీటర్ల దూరంలో బారికేడ్‌లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. సందర్శకులు సముద్ర అలల మధ్య సేద తీరారు .

స్కూళ్లకు నిధులు ఫుల్



నిడమర్రు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ధ్యేయమని, విద్యకు అధిక ప్రాధాన్యమిస్తామంటూ సూచించిన కూటమి ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు కావల్సిన నిధులును విడుదల చేసి చిత్తశుద్ధిని చాటింది. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో విద్యార్థులకు పాఠాలు బోధించడానికి కావల్సిన సుద్దముక్కలు కొనుక్కోవడానికి కూడా డబ్బులు లేక ఉపాధ్యాయులు జేబుల్లోంచి ఖర్చు పెట్టాల్సిన దుస్థితి నుంచి ప్రస్తుతం నూతన ప్రభుత్వం దూరం చేసింది. పాఠశాలల నిర్వహణకు కావల్సిన వస్తు సామగ్రి, కరెంట్ బిల్లులు, రిజిష్టర్ల కొనుగోలు మొత్తం ఈ కాంపోజిట్ గ్రాంట్ నుంచి పొందడం ద్వారా ఉపాధ్యాయులకు ఊరట లభించినట్టయింది. మండల వనరుల కేంద్రంలో ఒకప్పుడు జిరాక్స్ కాపీలకు సొమ్ముల్లేక చేతి డబ్బులు ఖర్చు చేసుకున్న ఎంఈవోలు ప్రస్తుతం మండల వనరుల కేంద్రం గ్రాంట్ విడుదలతో ఊరట చెందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో హెచ్‌ఎంల జేబులకు చిల్లు..

గతంలో పాఠశాలల నిర్వహణ ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రతి పాఠశాలకు వారి విద్యార్థుల హాజరు నమోదు ఆధారంగా రూ.5,000 నుంచి రూ.25000 వరకు నిధుల మంజూరు చేసేవారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే జూన్, జూలై నెలల్లో ఆయా పాఠశాలల విద్యాకమిటీ బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ అయ్యేవి. స్కూల్ గ్రాంట్, మెయింటనెన్స్ గ్రాంట్, టీఎం గ్రాంట్ రూపాల్లో నిధులు మంజూరయ్యేవి. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో గత నాలుగేళ్లుగా పాఠశాల నిర్వహణ ఖర్చులకు సొమ్ములు విడుదల చేయలేదు. గత విద్యా సంవత్సరం పాఠశాల నిర్వహణకు ఒక్క రూపాయి నిధులు విడుదల కాకపోవడంతో ఉపాధ్యాయులే తమ జేబుల్లోంచి సొమ్ములు వెచ్చించాల్సి వచ్చింది. ఈలోపు బదిలీలు జరగడంతో ఖర్చుచేసిన దానికి నిధులు విడుదల కాక బిల్లులు సబ్మిట్ చేసే అవకాశం లేక వదులుకోవాల్సి వచ్చింది. ఈ విధంగా ఒక్కో పాఠశాల హెచ్‌ఎం ప్రాథ మిక పాఠశాల అయితే రూ.10వేలు, ప్రాథమి కోన్నత పాఠశాలకు రూ.20 వేలుపైచిలుకు ఇక ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు రూ.50 వేల పైచిలుకే చేతి చమురు వదిలించుకున్నారు.

కాంపోజిట్ గ్రాంట్‌తో ఉపయోగాలు

పాఠశాలలకు విడుదల చేయబడిన కాంపో జిట్ గ్రాంట్‌ల ద్వారా పాఠశాలల నిర్వహణ చాలా బాగుంటుందని ఉపాధ్యాయ వర్గాలు వక్కానిస్తున్నాయి. పాఠశాలలకు కావల్సిన సుద్దముక్కలు , రిజిష్టర్లు, పుస్తకాలు, స్టేషనరీ వంటి సామగ్రి కొనుగోలు తోపాటు పాఠశాల లో చేపట్టే జాతీయ పండుగలు, వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చును. మైనర్ రిపేర్లు తో పాటు మేజర్లు రిపేర్లు, ల్యాబ్ వస్తువుల కొనుగోలు, ఆట వస్తువుల కొనుగో లు, వాటర్ ప్యూరిఫైయర్లు రిపేరు , కంప్యూట ర్లు, టీవీ ల రిపేరు వంటి వాటికి ఉపయోగించు కోవచ్చని నిబంధనలు చెబుతున్నాయి.

గ్రామాల అభివృద్ధిపై కూటమి దృష్టి

▸ రహదారి వెంబడి చెత్త, ఆక్రమణల తొలగింపు

కైకలూరు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలం కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత వైసీపీ పాలనలో ప్రధాన రహదారుల వెంబడి చెత్తను పోసి దాని ద్వారా వచ్చే కాలుష్యాన్ని ప్రజలకు అందించారు. రహదారి వెంబడి ఆక్రమణలకు గురిచేసి నివాసగృహాలు ఏర్పా టు చేసుకున్న ప్రజలకు ఇళ్ళ స్థలాల పట్టాలు పంపిణీ చేసి ఇళ్ళను తొలగించేందుకు చర్యలు చేపట్టకుండా వదలివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్తను మరో ప్రదేశానికి తరలించి ప్రజలను, ప్రయాణికులను కాలుష్యం బారి నుంచి కాపాడే ప్రయత్నానికి శ్రీకారం చుట్టారు. కైకలూరు నియోజకవర్గ కేంద్రంలో ఈ పనులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. పట్టణంలోని పంట కాల్వ వెంబడి ఏర్పాటు చేసిన మాంసపు దుకాణాలు, బడ్డీకొట్లను ఇతర ఆక్రమణలను తొలగించారు. ఆటపాక గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలల ఎదు రుగా ప్రహరీల వెంబడి ఎన్నో సంవత్సరాలుగా పేదలు పూరిగుడిసెలు వేసుకుని నివశించే వారు. గత ప్రభుత్వ హయంలో జానపేట సమీపాన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. కొంతమందికి స్థలాలు వచ్చినా రహదారి వెంబడి ఉన్నచోటే నివశించడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిపై దృష్టి సారించి గ్రామసర్పంచ్ తలారీ జాన్‌మణి ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించారు.




కైకలూరు-ఏలూరు రోడ్డులో జగనన్న గ్రీన్‌విలేజ్ ఎదురుగా చెత్త దగ్ధం.. .తొలగించిన దృశ్యం

ఆటపాకలో ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రహారీ వెంబడి ఆక్రమణల తొలగించిన దృశ్యం


మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తా

మంత్రి పార్థసారథి


చనుబండలో దీపం-2 పథకం ప్రారంభిస్తున్న మంత్రి సారథి

చాట్రాయి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సాధ్యమై నంత త్వరగా పూర్తి చేసి ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలోని 5 లక్షల ఎకరాల మెట్ట భూములను సస్యశ్యామలం చేస్తానని నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముందుగా పోలవరం గ్రామంలో శ్రీఉమా కోటేశ్వరస్వామిని మంత్రి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చాట్రాయి, సూరంపాలెం, చనుబండ గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు, చాట్రాయిలో రోడ్డు గుంతలు పూడ్చే పనులు మంత్రి ప్రాంభించారు. తరువాత చనుబండ కల్యాణ మండపంలో దీపం-2 కింద లబ్ధిదారులకు గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటు న్నదని, ఈ పథకం పూర్తి అయితే మెట్ట భూము ల్లో బంగారు పంటలు పండి ఈ ప్రాంతం సం పన్నమవుతుందన్నారు. ఏలూరు జిల్లాలో రూ.76 కోట్లతో, నూజివీడు నియోజకవర్గంలో రూ.20 కోట్లతో రోడ్ల గుంతలు పూడ్చే పనులు చేపట్టా మని ఈ పనులు సంక్రాంతికి పూర్తి కావాలని చంద్రబాబు నిర్దేశించారని అన్నారు. దీపావళి కానుకగా దీపం-2 పథకం కింద ప్రతి కుటుంబా నికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం చేసినప్పటికి చంద్ర బాబు తన పాలనాదక్షతతో అభివృద్ధి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నా రన్నారు. మండల టీడీపీ అధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, టీడీపీ నాయకులు కాపా శ్రీనివాసరావు, మందపాటి బసవారెడ్డి, మోరంపూడి శ్రీనివాస రావు, బొట్టు లక్ష్మణరావు, మరిడి చిట్టిబాబు, నక్కారాము, తల్లాడ శ్రీనివాసరావు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నుండి టీడీపీలో చేరికలు

చనుబండ సభలో మంత్రి పార్థసారథి సమ క్షంలో పర్వతాపురంనకు చెందిన వైసీపీ నాయ కుడు మిద్దే సత్యనారాయణ(అడవి సత్యం) నాయకత్వంలో అధిక సంఖ్యలో వైసీపీ కార్యక ర్తలు టీడీపీలో చేరారు. వీరికి మంత్రి పసుపు కండువాలు కప్పి టీడీపీలో చేర్చుకున్నారు.

ఆప్యాయంగా అన్నా చెల్లెళ్ల పండుగ


ముదినేపల్లిలో చెల్లెళ్ల ఇంటి వద్ద సోదరులు

ముదినేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు తమ ఆచార సాంప్రదాయంగా వస్తున్న అన్నాచెల్లెళ్ల పండుగను ఆదివారం ఆప్యాయత అనురాగాల మధ్య జరుపుకు న్నారు. చెల్లెళ్ల ఆహ్వానం మేరకు అన్నలు వారి ఇళ్లకు వెళ్లి భోజనాలు చేసి తిరిగి చెల్లెళ్లకు సోదరులు నూతన వస్త్రాలు బహూకరించి మీకు మేము రక్ష అంటూ ఆశీర్వదించడం ఆన వాయితీ. ఆనవాయితీ ప్రకారం ముదినేపలి లోని ఆర్యవైశ్యులు అత్తింట ఉన్న తమ చెల్లెళ్ల ఇళ్లకు వెళ్లి భోజనం చేశారు. భగినీ హస్త భోజనం పండుగ సందర్భంగా పలువురు వైశ్యులు తమ చెల్లెళ్ల చేతి భోజనం చేసి ఆహ్లాదంగా గడిపారు. పలు ప్రాంతాల నుంచి ముదినేపల్లి ప్రాంతంలోని చెల్లెళ్ల ఇంటికి అన్నలు వచ్చి భోజనాలు చేశారు. చెల్లెలి చేతి భోజనం ఈ పండుగ రోజున తింటే తమకు అపమృత్యు భయం తొలగుతుందని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వైశ్యులు తెలిపారు.

హాస్టళ్లకు మిక్సీలు బహూకరణ



కలిదిండి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో బీసీ బాలికల హాస్టల్, ఎస్సీ బాలుర వసతిగృహాలకు తాడినాడకు చెందిన టీడీపీ నాయకులు కొత్తపల్లి బంగార్రాజు ఆర్థిక సాయంతో మిక్సీలు బహూకరించారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు కేక్‌లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోర్రా అరవింద్, ఇమ్మానేని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మానికి సారథులమవుదాం


ప్రచారంలో ఆచలగురు ప్రచార కర్తలు

ఆగిరిపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ నిర్మాణానికి మేము సైతం సారథులం అవుతామని ముందుకు వచ్చారు. ఆగిరిపల్లి వ్యాపార ప్రతినిధి కొల్లా సాయిరాం సవిత దంపతులు. ఆగిరిపల్లి బ్రాహ్మణ బజారులో అచల గురు గీతా మందిరం భవ నం నిర్మించి ఇచ్చారు. ఆచల సాంప్ర దాయ సిద్ధాంతాన్ని అనుసరించి వీరు ఇరువురు దంపతులతో వితరణ చేసిన భవనాన్ని శివరామ దీక్షిత గురువులు ప్రారంభించారు.

ఆధ్యాత్మిక సేవలో మంత్రి

ఆగిరిపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అడవినెక్కలం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన అయ్యప్పల భజనకు మంత్రి కొలుసు పార్థసారథి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అనంతరం అయ్యప్పల పూజలో మంత్రి సారథి పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

కైకలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీ ణా ప్రాంతాల్లోని అంతర్గత రహదారుల అభివృ ద్ధికి రూ.28 కోట్ల నిధులను కేటాయించామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులోని 8వ వార్డు ఆదివారం సీసీ రోడ్డు పనులకు అయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభు త్వ హయంలో రహదారుల అభివృద్ధిని విస్మరిం చారని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గుర య్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణా ప్రాంతాల రహదారుల అభివృద్ధితో పాటు ఆర్‌అండ్‌బి రహదారులపై గుంతలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామన్నా రు. వచ్చే సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా కూడా రహదారులపై గోతులు లేకుండా చేస్తా మన్నారు. అలాగే గ్రామీణా ప్రాంతాల్లో అంత ర్గత రహదారులు సైతం ప్రణాళికబద్దంగా అభి వృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కూటమి నేతలు పి.రామచంద్రరావు, బి.ఏసురాజు, ఎస్.సుబాబు, డి.శ్రీనివాసరావు, కె.వరప్రసాద్, వార్డు సభ్యుడు ఎం.నాంచారాయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు


యోగశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్

నూజివీడు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగా క్రీడా పోటీలకు నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎన్నికైనట్లు ఆర్జీయుకేటీ రిజిస్ట్రార్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. భువనేశ్వర్ కేఐటీ యూనివర్సిటీలో డిసెంబరు 24 నుంచి 27 వరకు అసోసియేట్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయ యోగా పోటీల్లో తమ విద్యార్థులు మొత్తం 18 మంది పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు. ఏవో లక్ష్మణ్, స్పోర్ట్ బోర్డు సెక్రటరీ షంసాద్ బేగం, యోగా శిక్షకులు సత్య శ్రీధర్ పాల్గొన్నారు.

పంట కాలువలో పడి ఒకరి మృతి


పట్టపు బాబ్జి

కైకలూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యా నికి బానిసైన వ్యక్తి పంటకాలువలో స్నానం చేస్తూ ప్రమాదవసాత్తు నీటమునిగి మృతి చెందిన సంఘటనపై టౌన్ ఎఎస్సై మల్లికార్జున రావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం ఆటపాక గ్రామానికి చెందిన పట్టపు బాబ్జి(48) భార్య కొంతకాలం క్రితం చనిపోగా కొడుకు గత 6 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తన ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కాగా వేరు ప్రాంతంలో ఉన్నారు. దీంతో ఆటపాకలోని తన సోదరి ఇంటి వద్ద జీవిస్తున్నాడు. కుమారుడు చనిపోయినప్పటి నుండి మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఓ ఫంక్షన్‌కు వెళ్లి తిరిగివచ్చి స్నానానికై పంటకాలువలో దిగాడు. దీంతో ప్రమాదవసాత్తు మునిగిపోయాడు. స్థానికులు గమనించి హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. వారి బంధువులు పిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అప్పగించినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

ముసునూరు, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై ముసునూరు పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంకు చెం దిన యువతి ఈ నెల ఒకటో తేదీన రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరగి రాలేదు. బంధు వులు, చుట్టుప్రక్కల వెతికిన తన కుమార్తె కనిపించలేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతు బేజార్

ఐదేళ్లుగా పూర్తికాని నిర్మాణం


అసంపూర్తిగా ఉన్న రైతు బజార్

కలిదిండి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న రైతు బజార్ అటు రైతులు, ఇటు ప్రజలకు నిరాశ మిగిల్చింది. నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభిస్తే అందరికీ ప్రయోజనమని స్థానికులు భావిస్తున్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతు బజార్ నిర్మాణం 70 శాతం పూర్తి చేశారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో 10 శాతం పనులు మాత్రమే చేశారు. రైతుబజార్ అసంపూర్తిగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిల యంగా మారింది. రేయింబవళ్లు మందు బాబుల మద్యపాన కేంద్రంగా మారింది. తాగి పడేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లను ఆవరణంలో పడేస్తున్నారు. టీడీపీ పాలనలో అప్పుడు మంత్రి కామినేని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి రూ.42 లక్షలతో రైతుబజార్ నిర్మా ణానికి శంకుస్థాపన చేశారు. 70 శాతం పనులు పూర్తి కాగా తర్వాత వైసీపీ ప్రభుత్వంలో నిర్మా ణం నిర్లక్ష్యం చేశారు. కూరగాయలు పండించే రైతులు పలు అవస్థలు పడ్డారు. పరిసర ప్రాంతా ల రైతులు కైకలూరు, గుడివాడ, ఏలూరు బస్సు ల్లో కూరగాయలు తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. రైతులకు గిట్టుబా టు ధర లభించక నష్టాల పాల వుతున్నారు. బ యట మార్కెట్‌లో కూరగాయల అధిక ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రైతు బజార్ ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.


సింగరాయపాలెంలో విద్యుత్ కాంతులతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం

నాగుల చవితికి ఆలయం ముస్తాబు

ముదినేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి ఉత్సవాలకు ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపా లెం సెంటర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 5న జరుగనున్న నాగుల చవితి పండుగ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలం కరణ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థా నం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తు న్నారు. పుట్టలో వేలాది మంది భక్తులు పాలు పోసేందుకు వీలుగా క్యూ లైన్లు ఏర్పాటు చేస్తు న్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనానికి కూడ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్ఐ వీరభద్రరా వు దేవస్థానం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. పెదగొన్నూరు శివారు ఉప్పరగూడెంలో ప్రత్యేక ఆచార సాంప్రదా యాలతో నిర్వహిం చనున్న నాగుల చవితి ఉత్సవాలకు నిర్వాహక కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. పార్వతీ పరమేశ్వ రులకు పూజలు చేసేందుకు భక్తులకు సౌకర్యా లు కల్పిస్తున్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష


శ్రీహరిపురంలో అన్న సమారాధనలో భక్తులు

ముదినేపల్లి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ముదినేపల్లి మం డలం శ్రీహరిపురంలోని షిర్డి సాయిబాబా మందిరంలో ఆదివారం అయ్యప్ప దీక్షాపరుల కు కార్తీక అన్న సమారాధన నిర్వహించారు. చేవూరుపాలెంకు చెందిన మేలిమి రామాంజ నేయులు దంపతులు గురుస్వాములు నీలం మల్లేశ్వరరావు స్వామి ఆధ్వర్యంలో సుమారు 600 మంది అయ్యప్ప, భవాని మాలధారులకు అన్న సమరాధన నిర్వహించారు. రంగాపురం లోని సాయిబాబా మందిరంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సుమారు 400 మందికి అన్నదానం చేశారు. అల్లూరు పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసో త్సవాల్లో భాగంగా భక్తులు నక్షత దీపారాధన చేశారు.

దుకాణాల్లో తనిఖీలు


మాంసం దుకాణంలో తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారులు

నూజివీడు టౌన్, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి): పట్టణ, మండల ప్రాంతాల్లోని పలు దుకాణాల్లో తూనికల-కొలతలు శాఖ నూజి వీడు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సీ.హెచ్ వాసుదే వరావు తనిఖీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వాస్తవ కన్నా అధికంగా నమోదు చేసిన ఎలక్ట్రానిక్ కాటాలను గుర్తించి 8 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా మాంసం విక్రయ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు.

సంక్షోభంలోకి నెడుతున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న పవన్

నూజివీడు టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజ ల ను సంక్షేమం పే రిట సంక్షోభంలోకి నెడుతుందని యూ త్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్ కుమార్ అన్నా రు. ఆయన నూజివీడులో ఆదివారం మాట్లాడుతూ గత జగన్ పాలనలో ట్రూ అప్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలు పెంచగా గగ్గోలు పెట్టిన కూటమి నాయకులు నేడు అదే బాటలో పయనిస్తున్నారన్నారు. సర్దుబా టు చార్జీల పేరుతో సామాన్యులపై పెనుభా రం మోపుతున్నారని దాదాపు రూ.3 లక్షల కోట్లు ప్రజలపై భారం మోపడం తగదన్నారు. తక్షణం సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.